# సంపాదకీయం



మానవుల రక్షణార్థమై క్రీస్తు భూలోకంలోపుట్టి, ప్రేమను బోధించి, తన సిలువ మరణం, పునరుత్థానాలతో మానవులకు విమోచన అనుగ్రహించి మోక్షపు వాకిలిని తెరచారు. ఆ క్రీస్తును విశ్వసించి, వారి బోధనలను పాటించి ఈ లోకంలో క్రీస్తుకు సాక్షులుగా జీవించి మరణించిన వేదసాక్షులు పునీతులు ఎంతో మంది ఉన్నారు.

పునీతులంటే వారు స్వర్గం నుండి భువికి దిగివచ్చిన వారు కాదు. మనలా వారి వారి కుటుంబాలలో పుట్టినవారే. అనుకూల పరిస్థితులలో, ప్రతికూల పరిస్థితులలో కష్టాలు, బాధలు ఎదురైనా క్రీస్తునందు విశ్వాసాన్ని పెంచుకొని, క్రీస్తుకోసం జీవితాలను ధారపోసినవారు. “నన్ను వెంబడించు”, నీ సిలువను ఎత్తుకొని నన్ను అనుసరించు” అని క్రీస్తు ఆహ్వానాన్ని అందుకొని అనుసరించారు. పాపమనే శత్రువును ఎదుర్కొని విజయాన్ని పొందినవారే ఈ పునీతులు.

అలాంటి వారిలో పునీత తోమాస్ గారు క్రీస్తునందు అచంచల విశ్వాసాన్ని ప్రకటించాడు. “నా ప్రభువా! నా దేవా! అంటూ ఓ విశ్వాస సత్యాన్ని ప్రకటించాడు. మనందరకు ఆదర్శమయ్యాడు.

ఈ లోకంలో దీక్ష, పట్టుదలతో దేవునిసేవ, మానవసేవ చేయడానికి క్రీస్తు తన శిష్యులను తన ఆత్మతో బలపరచాడు. బలపరుస్తూనే ఉన్నాడు. ఇది నిరంతర ప్రక్రియ.

దేవుని ప్రేమ, క్రీస్తు కృప మనపై ఉంది. ప్రస్తుత రోజుల్లో పాపం పెరిగి, సైతాను చేష్టలు వికృతంగా విజృంభిస్తున్న రోజుల్లో పవిత్రాత్మ సహకారం అవసరం. పవిత్రాత్మను స్వీకరించి హృదయంలోనే పదిలపరచుకొని ఆత్మ సహకారంతోనే పనులు నిర్వహించాలి. క్రీస్తు నవవధువైన శ్రీసభను అన్నివిధాలా అభివృద్ధిపరిచి, పోషించి అలంకరించి దేవునికి సదార్పితంగా మలచాలి. ఇది మన బాధ్యత. రక్షణ ప్రణాళికలో దైవ ప్రణాళికకు సహకరించిన పుణ్యదంపతుల, పుణ్యాత్ముల, ఆదర్శంతో మన జీవితాలను పవిత్రం చేసుకుంటూ, మన బాధ్యతలను నెరవేరుస్తూ ముందుకు సాగుదాం!



**ఫా. దామూల విజయ కుమార్**

**ఎడిటర్**

# సామాన్య 13వ ఆదివారం
# 02-07-2017

**2 రాజులు 4:8-11,14-16 రోమీ 6:3-4,8-11 మత్తయి 10:37-42**

క్రైస్తవులకు ఆధ్యాత్మిక మార్గదర్శి పవిత్రాత్మ ప్రభువు. ఈ పవిత్రాత్మ ప్రసాదించే ఆత్మజ్ఞానంతోనే క్రైస్తవులు యేసు ప్రభువును తెలుసుకోగలుగుతారు, ప్రభువుకు సన్నిహితులు కాగలుగుతారు; అంతేకాదు క్రైస్తవ దృక్పథంతోనే వారు లౌకిక వ్యవహారాలను బేరీజు వేస్తారు, క్రైస్తవ విలువలతోనే ప్రాపంచిక విషయాలకు విలువ కడతారు. అలాగే తాము ఎక్కడ ఉన్నా, ఏ పని చేస్తున్నా క్రైస్తవులు తమ మాటల ద్వారా చేతల ద్వారా యేసు ప్రభువు తత్వ మహత్వాలను చాటి చెబుతుంటారు, తమ సాటివారు సైతం ప్రభువును అనుసరించడానికి సహకరిస్తారు.

ఇందుకు "దివ్యసత్ప్రసాద" శక్తి వారికి తోడ్పడుతుంది. దివ్యసత్ప్రసాదం బోధకులను సత్యవేదానికి సాక్షులుగా, మరింత సమర్థులైన బోధకులుగా తీర్చిదిద్దుతుంది అలాగే సువార్తా సందేశాన్ని ఆలకించేవారు సహృదయంతో సత్యవేదాన్ని ఆలకించడానికి "దివ్యసత్ప్రసాదం" సహాయం చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే క్రీస్తు ప్రభువు ద్వారా తండ్రి దేవునికి విధేయులుగా విశ్వసనీయులుగా జీవించడానికి ప్రయత్నించే భక్తజనులందరికీ "దివ్యసత్ప్రసాదం" దివ్యశక్తి ప్రదాయినిగా నిలుస్తుంది, భక్తి జీవనంలో వారిని ముందంజ వేయిస్తుంది!

## మొదటి పఠనం: 2 రాజులు 4:8-11,14-16

ఈనాటి మొదటి సఠనంలో ఎలీషా ప్రవక్తకు ఆతిధ్యమిచ్చిన షూనేము వనిత వృత్తాంతాన్ని చదువుతున్నాం. నూతన నిబంధన కాలంలో యేసు ప్రభువుకు అపోస్తులులకు సాయం చేసిన మహిళలందరికీ ఈ షూనేము వనిత మంచి మాతృకగా కనిపిస్తుంది (లూకా 8:1-3; అ.చ. 16:13-15). గనుకనే ఈమె ఆదర్శ గుణాలను ప్రత్యేకంగా మననం చేసుకుంటున్నాం.

షూనేము వనిత ఒక సంపన్నురాలు; ఎలీషా దైవభక్తుడని తెలిసి ఆయనకు తన ఇంట ఆతిథ్యమిస్తుంది, భర్త అనుమతితో ఆయనకోసం ప్రత్యేకంగా ఒక విడిది కూడా ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పిస్తుంది. అంతే తప్ప, ఆయనపట్ల శ్రుతి మించిన శ్రద్ధ చూపినట్టు కనిపించదు. ఆమె ఎంత నిస్వార్థురాలంటే ఎలీషా దైవభక్తుడని తెలిసి కూడా తాను గొడ్రాలినన్న బాధను ఆయన ఎదుట వ్యక్తం చేయదు, దైవానుగ్రహంతో తనకొచ్చిన కష్టాన్ని తీర్చుమని కూడా కోరుకోరు. తనకున్న దానితో, దేవుడు తనకొచ్చిన కష్టాన్ని తీర్చుమని కూడా కోరుకోరు. తనకున్న దానితో, దేవుడు తనకిచ్చిన దానితో

సంతృప్తిపడే స్వభావం ఆమెది; గనుకనే ఎవరిని చేయి చాచి ఏదీ అడగదు, చివరికి ప్రవక్త ఎలీషా నుంచి కూడా ఎలాంటి సహాయాన్ని ఆశించలేదు. ఒక పరదేశి ఎవరూ చేయని ఉపకారం చేస్తూ కూడా దానికి ఎలాంటి ప్రత్యుపకారమూ కోరని సౌజన్యమూర్తి షూనేము వనిత.

అలాగే ఎలీషా ప్రవక్త కూడా దైవభక్తుడికి తగినరీతిలో ఆలోచించాడు; షూనేము వనిత తనకు చేస్తోన్న అతిథి మర్యాదలు వ్యక్తిగతంగా తనకు చేస్తున్నవికావనీ, అవి తనను పంపిన దేవునికే చెందుతాయనీ భావించాడు. గనుకనే దైవానుగ్రహంతో ఆ దంపతులుకు ఒక ఏడాది వ్యవధిలో పుత్ర సంతానం కలుగుతుందని దీవించాడు. ఎలీషా దీవెన ప్రకారమే దేవుడు వారికి ఒక కుమారుని ప్రసాదించారు.

నిజానికి ఏలీషా ప్రవక్త తన దివ్యశక్తితో ఇలాంటి అద్భుతం చేయాలని గానీ, తమకు సంతాన వరాన్ని ప్రసాదించాలని గానీ షూనేము వనిత కోరుకోలేదని చెప్పుకున్నాం. మరి ఎలీషా ప్రవక్తకు ఎందుకు ఆతిథ్యమిచ్చినట్లు? ఎలీషా దైవభక్తుడు గనుకనే ఆతిథ్యమిచ్చింది; ప్రవక్త నోట వెలువడే వాక్కు సాక్షాత్తూ దేవుని వాక్కేనని, దైవవాక్కే సత్యవచనమనీ మనసారా నమ్మిన భక్తురాలు గనుకనే షూనేము వనిత ఎలీషాకు ఆశ్రయమిచ్చి ఆదరించింది. (1రాజులు 17:24) ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె చేసిన అతిథి సత్కారాలు అద్భుత శక్తులుగల ఎలీషా ప్రవక్తకు కాదు, ఆయనలో కొలువుదీరి ఉన్న అద్వితీయుడైన భగవానుడికి, సత్యదేవునికి. ఇదే షూనేము వనిత వ్యక్తిత్వ వైశిష్ట్యం.

అలాగే ఎలీషా ప్రవక్తలా "దేవుడి మనిషిగా, దైవ భక్తుడిగా" జీవించదలచుకున్న ప్రతి వ్యక్తీ ఏలీషా ప్రవక్తనుంచి ఎలీషా స్వీకరించినట్లు ముందుగా దైవవాక్కును స్వీకరించాలి, తన సాటి వారికి సమకాలికులకు దైవోపదేశాలను బోధించాలి.

చివరిగా ఈనాటి సువార్త పఠనంలో కూడా యేసుప్రభువు తన శిష్యులకు ఆతిథ్యమిచ్చే వారి గురించి మాట్లాడుతున్నారు. తన శిష్యులకు "గుక్కెడు మంచినీరొసగి" (వ.42) ఆదరించినవారు సాక్షాత్తూ తననే ఆదరించిన వారవుతారనీ తగిన "బహుమానం" పొందుతారనీ ప్రభువు ప్రకటిస్తున్నారు. అంటే సందేశపరంగా సువార్త పఠనానికి ఈ మొదటి పఠనం మంచి ఉపోద్ఘాతమవుతుంది.

## రెండవ పఠనం : రోమీ 6:3-4,8-11

"పాపం", "మరణం" ఇవి రెండూ చర్యా ప్రతిచర్యల్లాంటివి; వీటినే "జంట అనర్థాలు" అనికూడా చెప్పవచ్చు. క్రైస్తవ విశ్వాసులు (క్రీస్తు శిష్యులు) జ్ఞానస్నానం పొందకముందు ఈ జంట అనర్థాల (పాపం,మరణం) ప్రభావంలోనే బతుకుతూ వచ్చేవారు.

జ్ఞానస్నానం తరువాత క్రైస్తవ విశ్వాసులు పునరుత్థానుడై తండ్రి దేవుని కుడి ప్రక్కన ఆశీనుడై ఉన్న క్రీస్తుప్రభువు ఎలాంటి దివ్యజీవంతో జీవిస్తున్నారో అదే దివ్యజీవంతో

నవజీవంతో జీవిస్తున్నారు. అంటే ప్రభుక్రీస్తు క్రైస్తవ విశ్వాసులతో పంచుకుంటున్న జీవం ఇహలోకంలో మానవమాత్రుడుగా జీవించినపుడు తనలో ఉన్న జీవం కాదు, ప్రస్తుతం తండ్రి దేవుని కుడిపక్కన ఆశీనుడై ఎలాంటి నవజీవంతో జీవిస్తున్నారో ఈ దివ్యజీవం ఆ నవజీవం ఆ నిత్యజీవాన్నే ప్రభువిప్పుడు క్రైస్తవులకు పంచి ఇస్తున్నారు.

ప్రభు యేసు తండ్రి కుడిపక్కన గడుపుతోన్న ఈ నవజీవాన్ని తన మరణ పునరుత్థానాల అనంతరం తండ్రి దేవుని పావన హస్తాల మీదుగా అందుకున్నారు; అంతేకాదు తన మరణ పునరుత్థానాల ద్వారానే యేసు ప్రభువు "పాపము"ను, దాని ఫలితమైన "మరణమును" కూడా జయించారు గనుక – ఆయన నవజీవాన్నే ప్రభువు జ్ఞానస్నానం అనంతరం తన శిష్యులకు కూడా ప్రసాదిస్తున్నారు.

ఇలా క్రీస్తు ప్రభువు ఏవిధంగానైతే తన మరణ పునరుత్థానాల ద్వారా "నూతన జీవాన్ని" పొందారో, అలాగే ఈ నూతన జీవాన్ని కోరుకునే మానవులంతా తప్పనిసరిగా మరణించి పునరుత్థానులు కావాలి. అప్పుడే వారు తండ్రి పక్కన ఆశీనుడై ఉన్న ప్రభుక్రీస్తు నవజీవాన్ని పంచుకోగలుగుతారు. క్రైస్తవుల విషయంలో ఇది "జ్ఞానస్నాన సంస్కారం" ఆచరించే గడియలోనే జరుగుతుంది; పాపానికీ మరణానికీ లోబడిన పాత స్వభావము జ్ఞానస్నానం పొందే క్షణంలోనే మరణిస్తుంది, క్రీస్తు ప్రభువు ప్రసాదించే నవజీవంతో క్రైస్తవులు పునరుత్థానులవుతారు.

కనుకనే పునీత పౌలు క్రైస్తవుల నుద్దేశించి మాట్లాడుతూ మీరు పాపం నుంచి విముక్తులయ్యారు, పాపపు ప్రభావం కలిగిన పాత స్వభావం నుంచి విడుదల పొందారు, మీరిపుడు స్వేచ్ఛాజీవులు, దేవునికి యోగ్యమైన నూతన జీవితాన్ని మీరిపుడు జీవిస్తున్నారు అని స్పష్టం చేస్తున్నాడు.

అయితే క్రైస్తవులు పొందిన ఈ నూతన జీవితం అనునిత్యమూ చైతన్యవంతంగా సాగిపోతూనే ఉండాలి. అంచెలు అంచెలుగా వికాసాన్ని పొందుతూనే ఉండాలి. భవిష్యత్తులో ప్రభు యేసుతో సహజీవనం చేసే ఆనందమయ దశ వరకు క్రైస్తవుల నవజీవన వికాసం ఇలా కొనసాగుతూనే ఉండాలి.

## సువార్త పఠనం: మత్తయి 10:37-42

యేసుప్రభువు తన అపోస్తలులకు వేద ప్రచార బాధ్యతను అప్పగిస్తూ చేసిన సుదీర్ఘ ప్రబోధంలోని చివరి భాగాన్ని మనమీనాటి సువార్త పఠనంలో చదువుతున్నాం.

ఈనాటి సువార్త పఠనంలో రెండు భాగాలున్నాయి.

**మొదటి** భాగంలో తన శిష్యులు తనకు మాత్రమే నమ్మకపాత్రులుగా మెలగాలనీ, తన మాటకే కట్టుబడి ఉండాలని యేసుప్రభువు స్పష్టంగా ఆదేశిస్తున్నారు. మిగతా మానవ సంబంధాలు అనుబంధాలన్నీ దేవుని ఆజ్ఞల పరిధిలో ప్రధానమైనవే అయినప్పటికీ క్రీస్తు ప్రభువును అనుసరించేటపుడు ఈ అనుబంధాలేవీ శిష్యుల కాళ్ళకు బంధాలు కాకూడదని ప్రభువు హెచ్చరిస్తున్నారు. అంటే 'కుటుంబ సంబంధాలను అనుబంధాలను

కోల్పోవడ'మనే సిలువను మోయడానికి కూడా క్రైస్తవులు సిద్ధంగా ఉండాలని యేసుప్రభువు స్పష్టం చేస్తున్నారు.

ఇక్కడ ప్రధానమైన పదబంధాలు రెండింటిని మనం గమనించాలి; "నన్ను అనుసరించు" (వ. 38), 'నా కొరకు" (వ. 39) అనే ఈ రెండు మాటలను బట్టి మనకు అర్థమయ్యేది ఏమిటంటే మనం మోసే జీవన సిలువలు, అనుభవించే బాధలు యేసు ప్రభువు కోసం, యేసును అనుసరించడంలో భాగంగా భరించినప్పుడే అర్థవంతమవుతాయి, రక్షాప్రదాయకాలవుతాయి. క్రీస్తు ప్రభువుతో నిమిత్తం లేకుండా మనమనుభవించే లౌకికమైన బాధలు, చేసే త్యాగాలు ప్రాపంచిక దృష్టితో చూస్తే అర్థవంతంగా కనిపించినా, పారలౌకిక దృక్పథంతో చూస్తే అర్థరహితులవుతాయి.

**ఉదాహరణకు:** ఒక సైనికుడు తన దేశం కోసం ప్రాణత్యాగం చేశాడనుకోండి; అతడు చేసిన ప్రాణత్యాగం అతడికి రక్షణ భాగ్యాన్ని సంపాదించి పెడుతుందా? లేదు! ఎందుకంటే అతడు తన ఇష్టానుసారం సైన్యంలో చేరాడు, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం యుద్ధం చేశాడు, యుద్ధంలో మరణించాడు. ఇది నిజంగా అపురూపమైన త్యాగమే. కానీ ఇది అతడికి రక్షణభాగ్యాన్ని ప్రసాదించలేదు.

ఒక వ్యక్తి క్రీస్తుప్రభువు ఎవరో తెలిసికొని, నిండుమనస్సుతో ఆయనను విశ్వసిస్తూ, ఆయన సత్యవేదాన్ని లోకమంతా ప్రకటించే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోతే ఆ త్యాగం అతడికి రక్షణభాగ్యాన్ని ఆర్జించి పెడుతుంది, నిత్యజీవం అతడి స్వంతమవుతుంది.

ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే ప్రభుశిష్యులు పవిత్రాత్మ ద్వారా క్రీస్తు ప్రభువును తెలుసుకోగలుగుతారు. కలుసుకోగలుగుతారు. అర్థవంతమైన రక్షాప్రదాయకమైన క్రైస్తవ జీవన విధానానికి రూపకల్పన చేసుకోగలుగుతారు. అలాగే తమ క్రైస్తవ జీవన విధానానికి రూపకల్పన చేసుకోగలుగుతారు. అలాగే తమ క్రైస్తవ జీవన విలువలకు భంగం వాటిల్లనంతవరకు వారి కుటుంబ అనుబంధాలు, సామాజిక సంబంధాలు, ప్రాపంచిక వ్యవహారాలన్నీ యథాతథంగా కొనసాగుతూనే ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే క్రైస్తవుల జీవితాలలో ఎన్ని బంధాలు ఎన్ని అనుబంధాలు అల్లుకొని ఉన్నప్పటికీ "ప్రభు బంధానికే" పెద్దపీట వేయాలి, ప్రభువుకే అగ్రతర ప్రాధాన్యమీయాలి.

**రెండవ**భాగంలో క్రీస్తు ప్రభువు చేత పంపబడిన వారిలో సాక్షాత్తూ యేసు ప్రభువును తండ్రి దేవుణ్ణి దర్శిస్తూ వారిని ఆహ్వానించి ఆదరించే సహృదయుల గురించీ వారికి లభించబోయే బహుమానాల గురించీ చదువుతున్నాం. ప్రవక్తలను స్వీకరించి ఆదరించేవారు "ప్రవక్త బహుమానం" పొందుతారు; నీతిమంతులను సాదరంగా స్వాకరించేవారికి "నీతిమంతుని బహుమానం" లభిస్తుంది; అపోస్తులులను ఆహ్వానించి ఆదరించే వారు సముచితమైన బహుమానం తప్పనిసరిగా పొందుతారు.

సాధారణంగా బైబులు గ్రంథంలో "ప్రవక్తలు, నీతిమంతులు" అనే రెండు తరహాల భక్తజనులను తరచు "జంటపదాలు" గా ప్రయోగిస్తూ ఉంటారు.

ఉదా: "ప్రవక్తలకు, సమాధులను నీతిమంతులకు స్మారక చిహ్నములను నిర్మింతురు" (మత్తయి 23:29)

ఇలా బైబులు గ్రంథంలో తరచు జంటగా కనబడే ఇరువర్గాల భక్తజనులకు తోడు యేసు ప్రభువిక్కడ మూడవమార్గం భక్తజనులను ప్రవేశపెట్టడం విశేషం. వారే అపోస్తలులు. వీరు స్వయంగా యేసుప్రభువుచేత పంపబడిన వేదబోధకులు!

చివరిగా మొదటిపఠనంలో చెప్పుకున్నట్లు దైవజనులను ఆదరించడం ఆశ్రయించడం ముఖ్యం కాదు, ఏ ఉద్దేశ్యంతో వారిని ఆదరిస్తున్నామన్నది ప్రధానం. దైవజనులను ఆహ్వానించేవారు ఆదరించేవారు సాధారణంగా వారికి సమాజంలో గల గౌరవహోదాలను చూచి ఆదరిస్తూ ఉంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. ఆయా భక్తుజనులలో సాక్షాత్తూ దైవవాక్కు కొలువుదీరి ఉన్నందుకుగాను వారిని ఆదరించాలి. వారు స్వయంగా యేసుక్రీస్తు ప్రభువు చేత పంపబడినవారు గనుక సాదరంగా ఆహ్వానించాలి.

అలాగే ఈనాటి సువార్త పఠనం మన ముందు రెండు సవాళ్ళను నిలుపుతోంది **ఒకటి**: క్రీస్తు ప్రభువు గురించి గానీ, క్రీస్తు సువార్తా బోధకుల గురించి గానీ క్రైస్తవులమైన మనలో ఏవైనా అపోహలుంటే వాటిని వెంటనే తొలగించుకోవాలి. ఉపేక్ష, నిర్లక్ష్యం, అనాదరణ భావాలవంటివి ఉంటే వాటిని సవరించుకోవాలి. ప్రభువుపట్ల ప్రభు బోధకులపట్ల సద్భావాన్ని పెంచుకోవాలి; సముచితమైన గౌరవ మర్యాదలతో వారిని స్వీకరించాలి, సన్మానించాలి.

**రెండవది:** మనం వేదబోధకులమైతే నియమనిష్టలతో, అంకిత భావంతో సువార్తా ప్రబోధం చేయాలి, క్రీస్తు ప్రభువును నిర్భయంగా ప్రపంచానికి వెల్లడించాలి . తమ ప్రబోదాలను ఆలకించిన ప్రతి ఒక్కరూ క్రీస్తు ప్రభువును తమ జీవితాలలోనికి తమ కుటుంబాలలోనికి ఆహ్వానించే విధంగా సమర్థవంతంగా సత్యోపదేశం చేయాలి.

**ముగింపు :**

మానవసేవా కార్యక్రమాలన్నీ మంచివే అలాంటి సేవా ధర్మాలను నిర్వర్తించేవారు దేవుని దీవెనలు పొందుతారు, సముచితమైన బహుమానాలనందుకుంటారు.

అయితే "దైవసేవకు" లకు సహాయం చేసేవారు, వారిని ఆదరించి సేదతీర్చేవారు, అండగా ఉంటూ ప్రోత్సహించేవారు, రెట్టింపు బహుమానాలను అందుకోగలుగుతారనీ, దేవుడు తన దీవెలను ధారాళంగా క్రుమ్మరించి వారిని సన్మానిస్తారనీ శ్రీసభ ప్రబోధిస్తోంది.

సాటి మనిషికి మనం చేసే సేవ అతడికీ, అతడి కుటుంబానికీ మేలు చేస్తుంది. కానీ "దైవసేవకుడి" కి మనం చేసే సేవ సాక్షాత్తూ దైవ వాక్కునకు చేసే సేవ అవుతుంది. సువార్తా ప్రబోధా ఉద్యమానికి చేసే సేవ అవుతుంది. దైవరాజ్య నిర్మాణానికి చేసే మనవంతు సేవగా దేవుని ఆమోదం పొందుతుంది. మనకు దైవానుగ్రహాలను ఆర్జించిపెడుతుంది.

# సామాన్య 14వ ఆదివారం

## 09-07- 2017

***జకరియా 9:9-10 రోమా 8:9,11-13 మత్తయి 11:25-30***

జ్ఞానస్నానం ద్వారా క్రైస్తవులు పునరుత్థానుడైన క్రీస్తు ఆత్మను స్వీకరిస్తారు. క్రైస్తవుల అంతరంగాలలో కొలువుదీరి ఉండే పవిత్రాత్మ క్రీస్తుప్రభు దివ్య సన్నిధానాన్ని వారిలో నిరంతరమూ సాక్షాత్కరింపజేస్తూ ఉంటారు. ఇలా తమ అంతరంగాలలో కొలువుదీరే క్రీస్తు ప్రభువు ద్వారానే విశ్వాసులు తండ్రి దేవుని తెలుసుకోగలుగుతారు. ఈ విధంగా త్రిత్వైక దేవునితో క్రైస్తవులకు దివ్యానుబంధం ఏర్పడుతుంది; ఇది యదార్థమైంది. ప్రపంచంలో ఉన్న భౌతికమైన వాస్తవాలన్నింటి కంటే వాస్తవికమైంది. దేవునికి మానవులకు మధ్య ఏర్పడే సత్యానుబంధమిది, శాశ్వత సంబంధమిది!

## మొదటి పఠనం - జెకర్యా 9:9-10

ఈనాటి మొదటి పఠనంలో మనం చదువుతోన్న జెకర్యా ప్రవచనాలకు చారిత్రక నేపథ్యమేమిటో తెలుసుకుందాం: బాబిలోను రాజు నెబుకద్నెసరు యెరూషలేమును ముట్టడించాడు, నగరాన్ని నాశనం చేశాడు. యెరూషలేము రాజును, ప్రజలను కూడా బంధించి వారిని బాబిలోనుకు బానిసలుగా ఈడ్చుకు పోయాడు. అక్కడ 50 యేళ్ళపాటు దుర్భర ప్రవాస జీవనం గడిపాక క్రీస్తుపూర్వం 553లో యూదులు ముక్తిని పొందారు. అలా యెరుషలేముకు తిరిగి వచ్చిన యూదులు నాశనమై నగరాన్ని పునర్నించడానికి పూనుకున్నారు. నగర ప్రాకారాలను నిర్మించారు, యెరూషలేము దేవాలయాన్నీ ఇతర భవన సముదాయాలను పునరుద్ధరించే పనిలో నిమగ్నులయ్యారు. నూతన దేవాలయ నిర్మాణం పూర్తవుతోన్న తరుణంలో అంటే క్రీస్తు పూర్వం 520 ప్రాంతంలో జెకర్యా ప్రవక్త ప్రజల మధ్యకు వచ్చి దైవసందేశాలను ప్రకటించసాగాడు.

ఈరోజు మనం చదువుతోన్న ప్రవచనాలలో జెకర్యా తమ హృదయాలను దేవునికి పునరింకితం కావించు కొమ్మని యెరుషలేము ప్రజలను కోరుతున్నాడు. ధ్వంసమైన దేవాలయాన్ని పునర్నించి నూత్నీకరిస్తునట్లే యూదయా ప్రజలంతా తమ హృదయాలను దేవునికి పునరంకితం కావించుకోవాలని పిలుపునిస్తున్నాడు. వారు గనుక అలా చేస్తే, యెరుషలేము నగరాన్ని పాలించడానికి సాక్షాత్తూ మెస్సయా ప్రభువే వేంచేస్తారనీ, నగర రాజ్యమప్పుడు శాంతీ సౌబాగ్యాలతో వర్ధిల్లుతుందనీ జెకర్యా ప్రకటిస్తున్నాడు. అంతేకాదు రాబోయే మెస్సయా ప్రభువు శాంతి సామ్రాట్టుగా రాజ్యపాలన చేస్తాడనీ, ప్రాపంచిక పాలకుల్లా గర్వాంధుడై ఉండక, సాధుశీలుడుగా

మెలగుతాడనీ వెల్లడిస్తున్నాడు. అవును. మెస్సయా రాజ్యం ప్రపంచమంతా విస్తరిస్తుంది, అనంతకాలమూ అజేయంగా కొనసాగుతుంది; మెస్సయా ప్రభువు ఏలుబడిలో యుద్ధ సరంజామా పూర్తిగా ధ్వంసం కావించబడుతుంది. వారు సమకూర్చుకున్న రథాలు అశ్వదళాలు వగైరాలన్నీ ఛిన్నాభిన్న మవుతాయి. ఎందుకంటే మెస్సయా ప్రభువు శాంతి ప్రదానం చేస్తారు, లౌకికులైన రాజుల మాదిరి ఆయన ప్రజలను పలువిధాలుగా పీడించువారు కారు. ఆయన అందరినీ బంధ విముక్తులును కావిస్తారు. అందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదిస్తారు.

జెకర్యా పలికిన ఈ ప్రవచనాలన్నీ యేసుక్రీస్తు ప్రభువు ద్వారా నెరవేరాయి. మ్రానికొమ్మల ఆదివారం నాడు గార్ధభ వాహనంపై యెరూషలేము ప్రవేశం చేసిన యేసు ప్రభువే శాంతిదూత, శాంతి ప్రదాత, మానవ విమోచకుడు, లోకోద్ధారకుడు. అలాగే నాడు యేసు ప్రభువు ద్వారా నెరవేరిన జెకర్యా ప్రవచనాలు నేడు శ్రీసభ ద్వారా నెరవేరుతున్నాయి.

ఇకపోతే ఈ మొదటి పఠనం ఈనాటి సువార్త పఠనానికి చక్కని ఉపోద్ఘాతంలా ఉపయోగపడుతుంది. సువార్త పఠనంలో యేసు ప్రభువు తాను సాధుశీలుడనీ వినయాత్ముడనీ ప్రకటించబోతున్నారు.

## రెండవ పఠనం - రోమీ 8:9,11-13

పౌలు ఉద్దేశ్యంలో "శరీరము" అంటే భౌతిక దేహమని అర్థం కాదు. అది "ఒక మానసిక జైవిక శక్తి, ఆత్మకు భిన్నమైన ఆంతరంగిక శక్తి". ఈ శక్తి మానవులను తమ మానసిక, భౌతికావసరాలకు ప్రాధాన్యమీయుమని ప్రోత్సహిస్తూ ఉంటుంది, దేవుని ఆజ్ఞలను ధిక్కరించయినా సరే, తమ వాంఛలను తీర్చుకొమ్మని ప్రేరేపిస్తూ ఉంటుంది. తద్వారా ఆయా వ్యక్తులను దేవుని దృష్టిలో స్వార్థపరులుగాను, పాపులుగాను నిలుపుతుంది. ఈ "దుష్టశక్తి" దుర్బోధలకు చెవియొగ్గి దాని దుష్ప్రేరణలకు లొంగిపోయినవారు, దేవుడు నిర్దేశించిన ప్రకారం పవిత్ర జీవితము గడపలేరు. తమకు దేవుడు ప్రసాదించిన విలక్షణమైన వ్యక్తిత్వం ప్రకారం చైతన్యవంతంగానూ జీవించలేరు.

జ్ఞానస్నానం పొందే గడియలో అంతవరకు శరీరేచ్ఛల ప్రకారం దుష్టశక్తి ప్రేరణ ప్రకారం జీవిస్తూ వచ్చిన "పాతవ్యక్తి" మరణిస్తాడు దైవ విధేయుడుగా జీవించే నూతన వ్యక్తి ఆవిర్భవిస్తాడు; ఈ నూతన వ్యక్తిలో శాశ్వతంగా నివసించడానికి దేవుడు తన పవిత్రాత్మను ప్రసాదిస్తారు. గనుకనే జ్ఞానస్నానం పొందిన విశ్వాసులందరు అనునిత్యమూ, అనుక్షణమూ పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం పుణ్యజీవనం గడపడానికి నిబద్ధులై ఉంటారు. ఇలా పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం జీవించే వ్యక్తి మాత్రమే దేవుడు తనకు నిర్దేశించిన మార్గంలో దేవుడు తనకు ప్రసాదించిన ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో

అర్థవంతమైన ఫలప్రదమైన జీవనం గడపగలుగుతాడు. మరో మాటలో చెప్పాలంటే పవిత్రాత్మ ప్రభావంతో జీవించే వ్యక్తి మాత్రమే అక్షరాల తన ఆత్మ ప్రేరణ ప్రకారం స్వేచ్ఛగా జీవింపగలుగుతాడు.

కనుకనే పౌలు శరీరేచ్ఛలకు లొంగి పాపకర్మలకు వొడిగట్టే పాత వ్యక్తిత్వాన్ని భూస్థాపితం చేయుమని, పవిత్రాత్మకు విధేయులుగా జీవిస్తూ పునరుత్థాన భాగ్యాన్ని నిత్యజీవాన్ని స్వంతం చేసుకొమ్మని క్రైస్తవ విశ్వాసులందరిని ఉద్బోధిస్తున్నాడు.

## సువార్త పఠనం: మత్తయి 11:25-30

ఈనాటి సువార్తపఠనం యేసుప్రభు వ్యక్తిత్వ వైశిష్ట్యాన్ని వెల్లడిస్తుంది, తండ్రికీ ఆయనకూ గల వ్యక్తిగత సంబంధాన్ని ఆవిష్కరిస్తుంది. 'పరలోకమునకు భూలోకమునకు అధిపతి" యైన దేవుణ్ణి యేసుప్రభువిక్కడ "తండ్రీ" అని సంబోధిస్తున్నారు. ఈ ఆరు వచనాల్లోనే యేసు ప్రభువు దేవుణ్ణి అయిదుసార్లు "తండ్రీ" అని పిలువడం విశేషం.

నిజానికి ఏ యూదుడూ దేవుణ్ణి "తండ్రీ" అని పిలచే సాహసం చేయడు. ఈరకమైన సంబోధన యూదమత ఆధ్యాత్మిక సంప్రదాయంలో అసలు లేనే లేదు. గనుక సువార్తా రచయితలు గానీ, తొలిక్రైస్తవ సంఘాల విశ్వాసులు గానీ యేసుప్రభువుకూ దేవునికి మధ్య ఈ తరహా సంబంధాన్ని కల్పించి చెప్పే అవకాశమే లేదు. అంటే ఏదో ఒక సందర్భంలో స్వయంగా యేసు ప్రభువే దేవుని "తండ్రీ" అని సంబోధించినప్పుడు, చెవులారా విన్నవారు మాత్రమే ఈ విధంగా రాయగలరు. అంతేగాని ప్రభువు పలుకని మాటను ఆయన నోట పలికించడం ముఖ్యంగా ఈ విషయంలో అసాధ్యమని తెలుసుకోవాలి.

ఈ సువార్త పఠనాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చును. **మొదటి**భాగంలో చిన్న స్తుతిప్రార్థన కనిపిస్తుంది. ఈ ప్రార్థనలో ప్రభువు నిరక్షరాస్యులైన సామాన్య ప్రజలే నమ్మి అనుసరిస్తున్నారనీ, విద్యావంతులు వివేకవంతులు తనను నిరాకరిస్తున్నారనీ పరోక్షంగా వెల్లడిస్తున్నారు; అంతేకాదు అలా జరుగటమే తండ్రి దేవుని సంకల్పమని కూడా తెలియజేస్తున్నారు.

ఈ ప్రార్థనలో ప్రభువు తాను చేస్తోన్న ధార్మిక ప్రబోధాలు విఫలమయ్యాయన్న బాధను వ్యక్తం చేయడం లేదు; తాను తండ్రి దేవుని సంకల్పాన్ని గ్రహించగలిగినందుకు తండ్రి చిత్తాన్ని నిష్టగా నెరవేర్చగలుగుతున్నందుకు మనసారా దేవునికి ధన్యవాదాలు తెలియజేస్తునానరు. అలాగే, ఈ ప్రార్థనలో ప్రభువు మానవులకు గల విజ్ఞతను వివేకాన్నీ తప్పుపట్టడం లేదు; కానీ మానవుల అహంభావాన్నీ, స్వయం సమృద్ధ భావనను ఖండిస్తున్నారు; ఇలాంటివారు తమకున్న విజ్ఞానంతోను, వివేచనా శక్తితోను దేవునికీ దైవరాజ్యానికీ సంబంధించిన నిగూఢ సత్యాలను సైతం తెలుసుకోగలమని విర్రవీగుతూ

ఉంటారు. నిజానికి దేవుడు స్వయంగా సత్యావిష్కరణం చెస్తే తప్ప, మానవ మాత్రులెవ్వరూ దివ్యజ్ఞానాన్ని పొందలేరు, దేవుని తత్వమహత్వాలను గ్రహించలేరు. అలాంటి అహంకారులను విడనాడి, దీనాత్ములైన సామాన్య ప్రజలకు పారలౌకిక సత్యాలను వెల్లడిస్తున్నందుకుగాను యేసుప్రభువు తన తండ్రిని మనసారా స్తుతిస్తున్నారు; తనకూ తన రాజ్యానికీ సంబంధించిన సత్యసర్వస్వాన్ని వెల్లడి చేస్తున్నందుకు దేవునికి వందనాలు చెబుతున్నారు.

**రెండవ**భాగంలో యేసు ప్రభువు భారంతో అలసిసొలసిన వారందరినీ తన చెంతకు పిలుస్తున్నారు, తన సహచరులుగా చేరుమని ఆహ్వానిస్తున్నారు. యేసు ప్రభువుకు తండ్రి దేవుని గూర్చిన సంపూర్ణ పరిజ్ఞానం ఉంది, తనకున్న దివ్యజ్ఞానాన్ని సాటి మానవులకు బోధించే దివ్యాధికారమూ ఉంది. ఈ రెండింటినీ ప్రభువు తన సహచరులకు ప్రసాదిస్తారు. అంటే ప్రభు శిష్యరికమనే కాడిని స్వీకరించిన వారు తండ్రి దేవుని చిత్తమేమిటొ స్పష్టంగా తెలుసుకోగలుగుతారు. దేవుని చిత్తప్రకారం జీవించడానికి అవసరమైన పవిత్రాత్మ శక్తినీ పొందగలుగుతారు. ఇలా దైవసంకల్పాన్ని తెలుసుకొని దానిని నెరవేర్చడం ద్వారానే ప్రభుశిష్యులు తండ్రి దేవుని సాన్నిహిత్యాన్ని సాధించగలుగుతారు. తండ్రి దేవుని సహచర్యంలోనే వారు “విశ్రాంతి” ని అనుభవించగలుగుతారు.

ఈ విధంగా యేసుప్రభువుతో వ్యక్తిగతానుబంధం గల శిష్యులు మాత్రమే ఆయన ఎంతటి సత్యమూర్తులో ఎంతటి మృదుల స్వభావులో ఎంతటి సాధుశీలురో గ్రహించగలుగుతారు.

**ముగింపు :**

మనం కష్టాలను చూచి కలత చెందుతాం, కంటతడిపెట్టుకుంటాం, నిరాశ నిస్పృహలతో కుంగిపోతూ ఉంటాం, “ఈ లోకమే ఒక కన్నీటి కనుమ” అని చెప్పుకుంటూ మనల్ని మనమే ఓదార్చుకోజూస్తాం. అంతేగానీ మన జీవన సిలువలను మోసుకుంటూ సిలువనాథుడైన యేసుప్రభువు చెంతకు తరలివెళ్ళే ప్రయత్నం చేయం. మన సిలువ భారాన్ని సులభతరం చేయడానికి, మనలను బాధా విముక్తులన్ని చేయడానికి ప్రభువు సిద్ధంగా ఉన్నారు. నిండు విశ్వాసంతో ఆయన చెంతకు వెళ్ళి మన కష్టాలను కడగండ్లను ఆయనకు నివేదిస్తే చాలు, ఆయన మనలను కరుణిస్తారు, క్షమిస్తారు, మన బాధల భారాన్ని తొలగించి మనకు శాంతి వరాన్నీ, ఆత్మానందాన్ని ప్రసాదిస్తారు.

# సామాన్య 15వ ఆదివారం
# 16-07-2017

***యెషయా 55:10-11    రోమా 8:18-23    మత్తయి 13:1-9***

యేసు శిష్యుల్లో ఒకరు "గురుద్రోహి" అయినంత మాత్రాన యేసు స్థాపించ తలపెట్టిన దైవరాజ్య నిర్మాణ మహోద్యమం విఫలమైందని చెప్పలేము. ఎందుకంటే దైవరాజ్య నిర్మాతలు నిజానికి యేసుప్రభు శిష్యులు కారు. సాక్షాత్తు తండ్రి భగవానుడే యథార్థమైన దైవరాజ్య నిర్మాత గనుక తన రాజ్య నిర్మాణంలో ఆయన తప్పక కృతకృత్యులవుతారు. తండ్రి దేవునికి విధేయులైన యేసుక్రీస్తు ప్రభువు, ఆయన శిష్యులు తమకు ఎదురైన అన్ని ఆటంకాలను అపాయాలను అధిగమించి దైవరాజ్య నిర్మాణంలో తండ్రి దేవునికి సహాయకారులుగా నిలిచారు, ఫలితంగా తండ్రి ప్రసాదించే నిత్యజీవ బహుమానాన్ని పొందగలిగారు. వారికే కాదు దైవరాజ్యంలో సభ్యులైన విశ్వాసులందరికి ఇదే బహుమానం లభిస్తుంది. అయితే దైవరాజ్యంలో ప్రవేశించడానికి మనం అర్హులమవుతామా లేదా అన్నదే అసలు ప్రశ్న. దైవరాజ్య ప్రవేశాన్ని కోరుకునే వారు యేసు ప్రభువు పట్ల అంచంచలమైన విశ్వాసం కలిగివుండాలి; ఆయనను అనుసరించడానికీ ఆయన తత్వమహత్వాలను అర్థం చేసుకోవడానికి నిరంతరమూ సంసిద్ధులై ఉండాలి.

**మొదటి పఠనం: యెషయా 55:10-11**

ఇస్రాయేలీయులు ఈజిప్టు దాస్యం నుండి విముక్తులై వాగ్దత్త భూమివైపు తరలిపోయే సమయంలో (క్రీ.పూ 1200) మోషే వారిని హెచ్చరిస్తూ ఇలా అన్నాడు మీరు దేవుని ఆజ్ఞలకు విధేయులుగా జీవిస్తేనే వాగ్దత్త భూమి మీకు స్వంతమవుతుంది. ఒకవేళ మీరు దైవాజ్ఞలను మీరినట్లయితే మీ వశమైన వాగ్దత్తభూమి చేజారిపోతుంది. ఇలా మోషే ఎంతగా హెచ్చరించినా ఇస్రాయేలీయులు దేవుని ఆజ్ఞలను మీరారు, ఆయనకు అవిధేయులుగా జీవించారు. పర్యవసానంగా దేవుడిచ్చిన దేశాన్ని కోల్పోయారు. బాబిలోనియాలో బానిసలుగా ప్రవాసజీవనం గడుపుతున్నారు (క్రీ.పూ 585-535)

యెషయా గ్రంథంలోని 40వ అధ్యాయం నుంచి 55వ అధ్యాయం వరకు గల భాగంలో బాబిలోనియా ప్రవాసంలో ఉన్న ఇస్రాయేలీయులనుద్దేశించి యెషయా

పలికిన ప్రవచనాలున్నాయి. ఈ భాగాన్ని యెషయా శిష్యులలో ఒకరు రాశారని చెబుతారు. ఇశ్రాయేలీయుల ప్రవాసం ముగిసే దశలో ద్వితీయ యెషయా ప్రవాసులకు ఈ సందేశాలను అందజేసి ఉండవచ్చును.

అప్పటికే ప్రవాసంలో తాము నేర్చుకున్న గుణపాఠాల వల్ల ఇస్రాయేలీయులకు కనువిప్పు కలిగింది, తమ తప్పు తమకు తెలిసి వచ్చింది. దేవునితో తమకు గల అనుబంధమే తమకు రక్షణ కవచమవుతుందన్న సత్యాన్ని విస్మరించడం వలన, దేవుని ఆజ్ఞలను ధిక్కరిచి ఆయనతో తమకు గల అనుబంధాన్ని చేజేతులా తెగతెంపులు చేసుకోవడం వలననే తమకీ "ప్రవాసశిక్ష' ప్రాప్తించిందని వారు గ్రహించారు. పశ్చాత్తాపంతో కుమిలిపోయారు.

ఈ నేపథ్యంలోనే ద్వితీయ యెషయా ప్రవాస యూదులను ఓదార్చుతూ ప్రవచించాడు. వారు మరల దేవుని  కరుణకు పాత్రులవుతారని, దేవుడు వారిని తిరిగి యెరూషలేమునకు నడిపిస్తారనీ వారు కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి వారికి అప్పగిస్తారని, తప్పక వారిని రక్షిస్తారని అభయమిచ్చాడు.

ఈనాటి మొదటి పఠనంలో మనం చదుతుకున్న వచనాలు ద్వితీయ యెషయా పలికిన "ఓదార్పు ప్రవచనా" లకు ముక్తాయింపువంటివి. ఈ వచనాలలో ప్రవక్త "వాన", "మంచు" అనే ఉపమానాల సాయంతో తాను చెప్పదలచుకున్న సందేశాన్ని అందంగా అందరి మనస్సులకు హత్తుకొనేలా ప్రకటించగలిగాడు. నేలరాలిన వాన చినుకు, నేల వాలిన మంచుతెర ఆకాశానికి తిరిగి పోవు; అవి నేలను తడిపి సారవంతం చేస్తాయి, నేలపై పచ్చని పైరులను మొలిపిస్తాయి. అలాగే దేవుడు పలికిన ప్రతిమాట, ఆయన చేసిన ప్రతి వాగ్దానం నెరవేరుతుందని, అది అనివార్యంగా జరిగే శుభ పరిణామామమని ప్రవక్త ప్రకటిస్తున్నాడు.

మొదటి పఠనంలోని ఈ వాన చినుకు ఉపమానం ఈనాటి సువార్త పఠనంలోని "విత్తువాని ఉపమా" నానికి మాతృక వంటిది. మంచి నేలలో పడిన విత్తనం ఏ విధంగా మొలకెత్తి నూరంతలుగా ఆరువదంతలుగా ముప్పదంతలుగా ఫలిస్తుందో, అదే రీతిగా దేవుడు చేసిన ప్రతి వాగ్దానమూ ఫలిస్తుంది, దేవుని రక్షణప్రణాళిక తప్పక నెరవేరుతుంది.

## రెండవ పఠనం: రోమీ 8:18-23

పునీత పౌలు ఉద్దేశ్యం ప్రకారం మానవుడికీ దేవునికీ మధ్యగల సంబంధం

ఎంతపటిష్టంగా ఉంటుందో, మానవుడికి సాటి మానవులతో గల అనుబంధం, ప్రకృతీ పర్యావరణాలతో అతడికి గల సంబంధం అంతే పటిష్టంగా ఉంటాయి. నిజానికి దైవ మానవ సంబంధాలు సజావుగా కొనసాగినంతకాలం మానవుడికి గల ఇతరేతర అనుబంధాలు కూడా అవిఘ్నంగా కొనసాగుతూ వచ్చాయి. అయితే ఆదిమానవుడు ఆదాము చేసిన పాపం వలన, అతడికీ, దేవునికీ మధ్యగల సాన్నిహిత్యం విచ్ఛిన్నం కావడంతో, దాని దుష్ప్రభావం యావత్ మానవ జాతి మీద యావత్ సృష్టిమీద పడింది; మానవజాతికీ సృష్టికీ మధ్యగల సామరస్యం కుంటుపడింది. దీనితో మానవులకు ప్రకృతీ పర్యావరణాల పట్ల గల అవగాహన లోపభూయిష్టమైంది. పర్యవసానంగానే కొందరు ప్రకృతి శక్తులను దైవాలుగా భ్రమించి పూజిస్తూ ఉంటే ఇంకొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిని విచక్షణా రహితంగా వినాశనం చేయడం, కలుషితం కావించడం ఆరంభించారు. ఈ రెండు పరిమాణాల వలన మానవ జీవనానికి సృష్టికీ మధ్య కొనసాగవలసిన సమతుల్యం సామరస్యం అస్తవస్తమయ్యాయి.

కానీ ఇప్పటి పరిస్తితి అలాలేదు ఇప్పుడు మనం నూతన ఆదాము యేసుక్రీస్తు ప్రభువు ద్వారా దేవునికి దత్తపుత్రులం దత్తపుత్రికలము అయ్యాం. మన ఆత్మలతోపాటు భౌతిక శరీరాలు కూడా మహిమ పరుపబడే రక్షణ గడియ కోసం నిరీక్షిస్తూ ఆశాభావంతో జీవిస్తున్నాం. ఈ క్రమంలోనే చెల్లాచెదురైన ప్రాకృతిక సంబంధాలను కూడా పునరుద్ధరించుకోగలుగుతున్నాం.

అలాగే లోకోద్ధారకుడైన క్రీస్తు ప్రభువు ద్వారా మరణ వినాశాల నుంచి విముక్తిని పొందిర సృష్టి సమస్తం సంపూర్ణ రక్షణాఫల సిద్ధికోసం ఎదురు తెన్నులు చూస్తోంది. ప్రస్తుతం సృష్టి సమస్తము దేవుని సంకల్పం ప్రకారం పవిత్రులు, అపవిత్రులనే విచక్షణ లేకుండా మానవులందరికీ ఆలంబనగా నిలుస్తూ సేవలు చేస్తోంది. అయితే యథార్థమైన దేవుని సంతానమెవరో నిర్ధారణ జరిగిన అనంతరం, సంపూర్ణ విమోచనం పొందిన సృష్టి, ప్రకృతీ, పర్యావరణాలు కేవలం దేవుని సంతతికి మాత్రమే విధేయిస్తాయి, దేవుని సంతానానికే తమ మధుర ఫలాలలను అందజేస్తాయి.

అంతేకాదు ప్రస్తుతం బాధామయ జీవనం గడుపుతోన్న దేవుని దత్తపుత్రులు దత్తపుత్రికలు ఆత్మాంతరంగాలలో కొలువుదీరివున్న పవిత్రాత్మ ప్రభువే ఇటు మానవజాతీ, అటు విశ్వ సృష్టి రానున్న కాలంలో సంపూర్ణ విమోచన భాగ్యాన్ని పొందుతాయనడానికి “అభయం” గా నిలుస్తున్నారు.

## 3. సువార్త పఠనం: మత్తయి 13:1-23

దైవరాజ్యము అంటే ఒకానొక భౌగోళిక ప్రాంతంకాదు. దైవరాజ్యము అంటే ఒక భౌతిక పదార్థమూకాదు. మరేమిటంటే ఒక వ్యక్తి! అవును. దైవరాజ్య సర్వస్వమూ ఒకే వ్యక్తిలో మూర్తీభవించి ఉంది; ఆయనే యేసు క్రీస్తు ప్రభువు. ఆయనలోనే దేవుడు సంపూర్ణంగా కొలువుదీరి ఉన్నారు ఆయన ద్వారానే లోకరక్షణ కార్యాన్ని నెరవేర్చుతున్నారు. అలా దేవుని సన్నిధానానికి నెలవైన యేసుక్రీస్తు ప్రభువే దైవరాజ్యానికి ప్రతిరూపమై నిలుస్తున్నారు.

మత్తయి సువార్త 13వ అధ్యాయంలో దైవరాజ్య గుణ విశేషాలను తెలియజేసే ఏడు ఉపమానాలున్నాయి. దైవరాజ్యంపట్ల మానవులు చూపే ఏడు రకాల ప్రతిస్పందనలు కూడా మనకీ ఉపమానాలలో కనిపిస్తాయి. ఈ ఏడురకాల ప్రతిస్పందనలు కూడా మనకీ ఉపమానాలలో కనిపిస్తాయి. ఈ ఏడు ఉపమానాల్లో మొదటి ఉపమానాన్ని మనమీనాటి సువార్త పఠనంలో చదువుతున్నాం.

ఈనాటి పఠనంలో 1-9 వచనాలలో "విత్తువాని ఉపమానం", 18-23 వచనాలలో ఉపమాన వివరణ కనిపిస్తాయి. అలాగే తాను ఉపమానాల ద్వారా బోధించవలసిన అవసరమేమిటో కూడా యేసు ప్రభువు 10-17 వచనాలలో వివరిస్తున్నారు. ముందుగా యేసు ప్రభువిచ్చే వివరణ (వ. 10-17) చదివి ఉపమాన పఠనం ఆరంభిస్తే (వ. 1-9) సందేశాన్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి వీలవుతుంది.

యేసు ప్రభువిలా ఉపమానాల ద్వారా బోధించడానికి ప్రధాన కారణం ప్రజల మధ్యగల విబేధాలు. ప్రజలలో అప్పటికే రెండు రకాల వారున్నట్లు ప్రభువు గమనించారు. వీరిలో మొదటి రకం వారు దైవరాజ్య సంకేతాలను చూస్తారుగానీ, దేవుని వాక్కును ఆలకిస్తారుగానీ అర్థం చేసుకోలేరు. రెండవ రకం వారు దైవరాజ్య సంకేతాలను చూచి, దేవుని వాక్కును ఆలకించి అర్థం చేసుకోగలుగుతారు.

యేసుప్రభువిక్కడ ప్రస్తావించిన రెండు రకాల ప్రజలు మనకు యెషయా గ్రంథంలో (6:9-10) కూడా కనిపిస్తారు. "విన్నను అర్థం చేసుకోలేని ప్రజలు", "విని అర్థం చేసుకోగల ప్రజలు" ఇప్పటికీ ఉన్నారని సూచించడానికే ప్రభువిలా అన్నారు. అంటే దేవుని రాజ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ఉపమానాలను చెప్పకముందే ఆ రెండు ప్రజలూ అక్కడ ఉన్నారని అర్థం.

నిజానికి దేవుని చేత పంపబడినవారు దేవుని చేత ఆశీర్వదింపబడినవారు మాత్రమే యేసు ప్రభువును అర్థం చేపుకోగలుగుతారు. అంటే ముందుగా యేసు ప్రభువును తమ రక్షకుడుగా అంగీకరించి, ఆయన శిష్యులుగా మారినవారు మాత్రమే ఆయనను అర్థం చేసుకోగలుగుఅరు. అలాగే ఒక వ్యక్తి యేసు ప్రభువును స్వీకరించి ఆయన శిష్యగణంలో చేరాడు. అంటే అప్పటికే దేవుడు అతడికి/ఆమెకు యేసుప్రభు తత్వమహత్వాలను వెల్లడించారని అర్థం.

మరోమాటలో చెప్పాలంటే ఎక్కడ విశ్వాసం ఉంటుందో, అక్కడే దేవుని సత్యావిష్కరణ జరుగుతుంది. ఎక్కడ దేవుని సత్యావిష్కరణ జరుగుతుందో అక్కడ అధిక విశ్వాసం ఉంటుంది. మానవుడి విశ్వాసం, దేవుని సత్యావిష్కరణ పరస్పరం ఆలంబనాలుగా కొనసాగే జంట వాస్తవాలు: విశ్వాసం లేని చోట దేవుడు తన నిగూఢ సత్యాలను వెల్లడించరు. దేవుడు తన సత్యాలను వెల్లడించని చోట విశ్వాసం పాదుకొనదు "విత్తువాని ఉపమా" నాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఈ యథార్థాన్ని తెలుసుకోవాలి.

ఈ "విత్తువాని ఉపమానం"లో మనకు నాలుగు రకాల వ్యక్తులు కనిపిస్తారు. మొదటి మూడురకాల వ్యక్తులకు "అర్థం చేసుకొనే శక్తి" ఉండదు, నాల్గవ వర్గానికి చెందిన వ్యక్తులు మాత్రమే యేసు ప్రభువును దైవరాజ్యాన్నీ అర్థం చేసుకోగలుగుతారు. "అర్థం చేసుకోవడం" అనే లక్షణ మొక్కటే సమృద్ధిగా ఫలించే నాల్గవరకం వ్యక్తులను మిగతావారి నుంచి వేరు చేస్తుంది. నిజానికి దైవరాజ్యం గురించి మనం పూర్తిగా అర్థం చేసుకోవాలి అంటే ముందుగా మనకు యేసు ప్రభువుతో అత్యంత సన్నిహిత సంబంధం ఉండాలని తెలుసుకోవాలి.

మొదటి మూడు వర్గాల ప్రజలు కేవలం దేవుని వాక్యాన్ని "విన్నారు", కానీ దాని అంతరార్థాన్ని గ్రహించలేదు, గనుకనే వారు దైవరాజ్యాన్ని కోల్పోయారు.

ఈ ఉపమానం యేసుప్రభు శిష్యులకొక హెచ్చరిక వంటిది; యేసు ప్రభువును కోల్పోయే ప్రమాదం పట్ల శిష్యులు అప్రమత్తులై ఉండాలని ఉపమానం హెచ్చరిస్తోంది. అంతేకాదు నూరంతల పంటను సాధించాలన్నదే లక్ష్యమైతే, సాగునేలను పదునైన నేలగా మలచుకోవడం ఎంత అవసరమో కూడా ఆంతరంగిక స్వేచ్ఛను కలిగి ఉండాలనీ, స్పష్టమైన నిర్మలమైన స్వభావం కలిగి ఉండాలనీ బోధిస్తుంది. అలాగే దైవరాజ్యాన్ని అవగాహనం చేసుకొని దైవరాజ్య ప్రవేశం చేసి దైవరాజ్య పౌరులుగా జీవనం సాగించాలంటే విశ్వాసులు "పవిత్రాత్మశక్తి"ని విధిగా స్వతం చేసుకోవాలని కూడా ఈ

ఉపమానం స్పష్టం చేస్తోంది. అప్పుడే వారు "సారవంతరమైన నేల" ఫలసిద్ధిని పొందుతారు. అలా ఒకసారి యేసుప్రభు అనుచరులుగా మారిననాడు తమ ఆత్మాంతరంగాలను నిత్యమూ "సారవంతం"గా నిలుపుకోగలుగుతారు.

ఇక్కడ మనం తెలుసుకోవలసిన మరొక సత్యమేమిటంటే తన శిష్యగణంలో చేరడానికి, తనను అనుసరించడానికీ సిద్ధంగా లేని వారికి యేసు ప్రభువు ఎలాంటి సత్యప్రబోధమూ చేయరు. అలాగే ఎప్పటికి తన శిష్యులుగా చేరరని నిర్ధారణ జరిగితే అలాంటి వారికి యేసుప్రభువు ఎలాంటి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించరు. "జ్ఞానోదయం" కలిగించరు. గనుక దైవరాజ్యంలో ప్రవేశించాలన్నా, ఆధ్యాత్మిక ఫల సిద్ధిని పొందాలన్నా ముందుగా ప్రభు సాన్నిహిత్యాన్ని సాధించి, ఆయనకు అనుంగ శిష్యులమై ఆయనను అనుసరించడం తప్పనిసరి.

**ముగింపు:**

ఇది ఈనాటి దివ్యపూజ మన ముందుంచుతున్న ఆధ్యాత్మిక సవాలు. క్రైస్తవులమైన మనం క్రీస్తుప్రభువుకు సన్నిహితులుగా మెలగగలుగుతున్నామా? ఆయనకు అనుంగ శిష్యులుగా జీవిస్తున్నామా? దేవుని వాక్కు మనలో మొలకెత్తి, నూరంతలుగా అరవదంతులుగా ముప్పదంతలుగా ఫలించడానికి అనువైన పదనుగల నేల మనదేనని చెప్పుకోగలమా? లేక మనం రాళ్ళబాట మాదిరిగానో, ముండ్లతుప్పల మైదానం మాదిరిగానో నిస్సారంగా పడిఉన్నామా?

దేవుని వాక్కు మనలో మొలకెత్తి ఫలించాలంటే మన వంతు కృషి మనం తప్పక చేయాలి. యేసుప్రభువు పలికిన మాటను మనమీ సందర్భంలో మననం చేసుకుంటూ ఉండాలి? ప్రభూ, ప్రభూ అని  పలిచే ప్రతి ఒక్కరూ పరలోక రాజ్యంలో ప్రవేశించలేరు, పరలోకంలో నున్న తండ్రి చిత్తప్రకారం జీవించేవారే దేవుని రాజ్యంలో ప్రవేశించగలుగుతారు.

# సామాన్య 16వ ఆదివారం
# 23-07-2017

***జ్ఞాన 12:13,17-19   రోమా 8:26-27   మత్తయి 13:24-30***

దివ్య సత్ప్రసాదం ప్రభు శిష్యులను శక్తిమంతులలను చేస్తుంది. దివ్యసత్ప్రసాదం ద్వారా వారు సాక్షాత్తూ యేసుక్రీస్తు దివ్యశక్తినే పొందగలుగుతారు. అలా దివ్యసత్ప్రసాదం అందించే దివ్యశక్తి ప్రబావంతోనే ప్రభు శిష్యులు ఆంతరంగిక పరివర్తనను సాధించగలుగుతారు, తమను తాము నీతిమంతులుగా తీర్చిదిద్దుకోగలుగుతారు. అంతేకాదు దివ్యసత్ప్రసాదం ద్వారా శక్తిమంతులైన విశ్వాసులే దైవరాజ్య నిర్మాణంలో కీలకమైన పాత్ర వహించగలుగుతారు, మానవలోకంలో దేవుని పాలనను విస్తరింపజేయడానికి "సంధానకర్త" ల్లా వ్యవహరిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే దివ్యసత్ప్రసాదం ప్రభు శిష్యులను దైవరాజ్య నిర్మాతలుగా తీర్చిదిద్దుతుంది.

## మొదటి పఠనం: సోలో.జ్ఞాన 12:13,16-19

జ్ఞానగ్రంథ రచన క్రీస్తు పూర్వం 100 సంవత్సరాల ప్రాంతంలో జరిగింది. ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో స్థిరపడిన యూదుడొకరు ఈ గ్రంథాన్ని రచించినట్లు తెలుస్తోంది.

దేవుని దివ్యజ్ఞానం గురించి, దైవజ్ఞానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఈ "గ్రంథం" ప్రధానంగా వివరిస్తుంది. దైవజ్ఞానం వలన మానవులకు చేకూరే ప్రథమ ప్రయోజనం, లభించే అపురూపమైన వరం, నిత్యజీవం, దివ్యజ్ఞానం కలిగి దేవుని ఆజ్ఞలను విధేయులై నీతిమంతులుగా జీవించేవారికి నిత్యజీవం ప్రాప్తిస్తుంది.

ఈ సందర్భంలోనే రచయిత ఈజిప్టు దాస్యం నుంచి ఇస్రాయేలీయుల విమోచన ఘట్టాన్ని ప్రస్తావిస్తూ తన ఆజ్ఞలకు బద్ధులై తనకు విశ్వాసపాత్రులుగా జీవించిన వారికోసమే దేవుడు అద్భుత కార్యాలు చేశారన్న సత్యాన్ని ఉద్ఘాటిస్తున్నాడు.

ఈనాటి మొదటిపఠనంలో మనం చదువుకున్న వచనాలు దేవునికి గల అపారమైన ఓర్పును గురించి చెబుతున్నాయి. దేవుని జ్ఞానం, మహాశక్తి సార్వభౌమాధికారం పరిపూర్ణమైనవి గనుకనే ఆయన తన ప్రజల పట్ల జాలి కలిగి ఉంటారు, కరుణ చూపుతారు ఓర్పుతో సహించి ఊరకుండగలుగుతారు. (వ.18) దేవుడు తాను "కోరుకొనిన వెంటనే" తన ఇచ్ఛానుసారం ప్రవర్తించుటకు సర్వాధికారము గలవాడు. గనుకనే

దారితప్పిన వారిని తక్షణమే దండించుటకు ఆయన ఆతురపడరు; తప్పు చేసినవారు పశ్చాత్తపులై తన సన్నిధానికి మరలివచ్చు వరకు ఓర్పుతో ఎదురుచూడడం స్వశక్తిమంతుడైన దేవుడొక్కరికే సాధ్యమవుతుంది. దేవునికి దూరమై తిరిగి ఆయన క్షమను కారుణ్యాన్నీ చవిచూచిన వారు మాత్రమే దేవుని దయాగుణాన్నీ, ఆపారమైన ఆయన సౌజన్యాన్ని తెలుసుకోగలుగుతారు. గనుకనే మానవ మాత్రులకు ఎదురయ్యే జీవన సంక్షోభాలు, కష్టనష్టాలు, తాము దేవుని తెలులసుకోవడానికి అనువైన అపురూపమైన అవకాశాలవుతాయి. కష్టకాలంలో దేవుడు తమపట్ల చూపిన ఔదార్యాన్ని కారుణ్యాన్నీ గ్రహించగలిగితే దేవువని తత్వమహత్యాల దివ్యజ్ఞానం వారికి స్వంతమవుతుంది.

ఇలా దోషుల పట్ల కరుణ చూపడం, జాలిపడడం మానవ మాత్రులకు సాధ్యం కాదు మానవ సహజమైన జ్ఞానంతో ప్రవర్తించే మానవాధికారులు అసంపూర్ణులు. వారికి గల జ్ఞానమూ అధికారమూ కూడా అసంపూర్ణమైనవి. వారెప్పుడూ అభద్రతా భావంతో భీతిల్లుతూ ఉంటారు. గనుకనే పరులపట్ల జాలిపడడం దయతో మన్నించడం వారికి సాధ్యంకాదు. అది అన్నిటా సంపూర్ణుడైన దేవుడొక్కరికే సాధ్యమవుతుంది.

## రెండవ పఠనం: రోమీ: 8:26-27

పునీత పౌలు, సువారు 24 ఏళ్ళపాటు సువార్త ప్రబోధం చేశాక, సువార్త విలువలే ఊపిరిగా పుణ్యజీవనం గడిపాక రోమీయులకు ఈ లేఖ రాశాడు. సుదీర్ఘమైన భక్తి జీవనం ఆయనను ప్రార్థనా మూర్తిగా మార్చింది. సాక్షాత్తు పవిత్రాత్మప్రభువే పునీత పౌలును చేయిపట్టి నడిపించేవారు. అలా అనుక్షణము ఆత్మ సహవాసంలో గడిపిన సుదీర్ఘానుభవంతోనే పౌలు లేఖ రాస్తున్నాడు.

పౌలు ఉద్దేశ్యం ప్రకారం మానవ మాత్రులమైన మనం సహజంగానే బలహీనులం, అర్థవంతంగా ప్రార్థన చేయడమెలాగో కూడా తెలియని అసమర్థులం. గనుకనే మానవులు చేసే ప్రార్థనలు తరచు నిరర్థకమవుతాయి. అయితే మనమెంతటి బలహీనులమైనా దేవుడు మనలను చేయి విడువరు, తన పవిత్రాత్మ ప్రభువే మనలోని సహజ బలహీనతలను కూడా ప్రార్థనా స్పందనలుగా పరివర్తనం కావిస్తారు. అర్థవంతంగా ప్రార్థించడమెలాగో తెలియని మనం అరకొర జ్ఞానంతో చేసే "నిరర్థక" ప్రార్థనవలనే పవిత్రాత్మ ప్రభువు సార్థకమైన ప్రార్థనలుగా మలచి తండ్రి దేవుని సాన్నిధ్యానికి చేర్చుతారు. మనం చేసే ప్రార్థనల్లోని మన ఆశలను ఆకాంక్షలను మన మనస్సుల్లోను మన ఆత్మల్లోను కొలువుదీరి ఉన్న పవిత్రాత్మ ప్రభువు సకాలంలో గ్రహించి, వాటిని అవ్యక్త ప్రార్థనల ద్వారా తండ్రి దేవునికి విన్నవిస్తారు. అలా పవిత్రాత్మ మధ్యవర్తిత్వం ద్వారా మనం చేసే ప్రార్థనలు ఫలిస్తాయి.

దీనినిబట్టి మనం గ్రమించవలసింది ఏమిటంటే ప్రభు శిష్యులు తమ మనస్సులలో పవిత్రాత్మ ప్రభువును నిలుపుకొని, పవిత్రాత్మ మనోభావాలకు అణుగుణంగా స్పందిస్తూ ఆత్మవిధేయ జీవనం గడుపుతూ ఉన్నంత కాలం సాక్షాత్తు ప్రభువే తండ్రి దేవునికి వారిని సన్నిహితులను చేస్తారు. తండ్రి సంకల్పం ప్రకారమే వారిని నడిపిస్తారు.

## సువార్త పఠనం: మత్తయి 13:24-43

ఈనాటి సువార్త పఠనంలో మనం మూడు ఉపమానాలను చదువుతున్నాం "గోధుమలు కలుపు గింజలు ఉపమానం" "ఆవగింజ ఉపమానం", "పులిసిన పిండి ఉపమానం". ఈ ఉపమానాలు చెప్పాక స్వయంగా యేసుప్రభువే "గోధుమలు కలుపుగింజలు" ఉపమాన భావాన్ని శిష్యులకు వివరిస్తారు. వివరణకు ముందు ప్రభువు "సృష్టి ఆరంభము నుండి గుప్తమైయున్నవానిని బయలుపరచ" డానికే తాను ఉపమానాల రూపంలో సత్యోపదేశం చేస్తునట్లు ప్రకటిస్తారు (వ. 35)

ఈ మూడు ఉపమానాలు మానవలోకంలో దేవుని పాలన ఏవిధంగా వివరిస్తుందో తెలియజెబుతున్నాయి. ఆరంభంలో సుక్ష్మాతి సుక్ష్మంగా ఉన్నప్పటికీ, అగోచరంగా ఆరంభమైనప్పటికీ, విస్తరించే క్రమంలో ఎన్ని అవరోధాలకు అణచివేతకు అపజయాలకు గురైనప్పటికి దైవరాజ్యం దినదిన ప్రవర్ధమానమవుతుందనీ, దేవుని పాలన అజేయంగా విస్తరిస్తుందనీ ఈ ఉపమానాలు బోధిస్తున్నాయి. అయితే చివరికి దేవుడు ప్రదర్శించిన సహన గుణం వలన, ఆయన వహించిన ఓర్పు వల్లనే దైవరాజ్య విస్తరణ పరిపూర్ణముగా ఫలప్రదము అయిందని మనం తెలుసుకోవాలి. పై మూడు ఉపమానాలు మనకు బోధించే ఉమ్మడి సందేశం కూడా ఇదే.

బోధించే ప్రధాన సందేశం ఒక్కటే అయినప్పటికీ ఈ మూడు ఉపమానాలు దైవరాజ్యనికి సంబంధించిన ఒక్కో సత్యాన్ని ప్రత్యేకంగా మనకు తెలియజెబుతున్నాయి.

"ఆవగింజ ఉపమానం" దైవరాజ్యం ఏవిధంగా ప్రపంచమంతటా విస్తరిస్తుందో సూచిస్తుంది. అతి సాధారణంగా అనామకంగా ఆరంభమైనప్పటికీ, దైవరాజ్యం అంచెలు అంచెలుగా విస్తరించినపుడు ప్రపంచంలోని సకల జాతుల వారికి అది ఏవిధంగా ఆశ్రయమిస్తుందో పరోక్షంగా వెల్లడిస్తుంది.

"పులిసినపిండి ఉపమానం"లో చిటికెడంత పులుపు రాత్రికి రాత్రి కంటికి కనిపించకుండా తన ప్రభావాన్ని విస్తరించి, గోధుమపిండినంతా పులియబెడుతుంది. అలాగే దేవుని పాలన సైతం మానవుల అంతరంగాలను ప్రభావితం చేస్తూ క్రమక్రమంగా వారి జీవితాలను తన విలువల కనుగుణంగా పరివర్తనం కావిస్తుంది.

ఇకపోతే "గోధుమలు కలుపుమొక్కలు" ఉపమానాన్ని అర్థం చేసుకోవాలి అంటే "పవిత్రజీవనం" గడిపే నీతిమంతులకు, దేవుని ఆజ్ఞలను అతిక్రమించే "దుష్టు" లకు (వ.41) మధ్యగల వ్యత్యాసాన్ని తెలుసుకోవాలి. ఈ ఉపమానంలో గోధుమలు "నీతిమంతు" లకు ప్రతీకలయితే, కలుపు మొక్కలు "దుష్టు" లకు సంకేతాలు. యేసుక్రీస్తు ప్రభువు ప్రసాదించిన పవిత్రాత్మశక్తి వలన దేవుని ఆజ్ఞలను నిష్ఠగా పాటిస్తూ ఆయన సంకల్పాన్ని నెరవేర్చేవారు "నీతిమంతులు", వీరు నిరంతరమూ పవిత్రాత్మను తమలో నిలుపుకొని, ఆయన ప్రేరణ ప్రకారం సత్క్రియలనే ఆచరిస్తూ ఉంటారు, పాపకర్మలకు వొడిగట్టరు. "దుష్టులు" ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తారు. వీరు తమలోని దురాలోచనల ప్రకారం పాపకర్మలకు పాల్పడుతూ ఉంటారు; దేవుని ఆజ్ఞలకు గానీ దేవుని సంకల్పానికి గానీ విధేయత చూపకుండా దుష్క్రియలు చేస్తూ నిర్లజ్జగా జీవిస్తూంటారు. "జనులు నిద్రించువేళ పగవాడు వచ్చి కలుపుగింజలు చల్లినట్లు" (వ.25) దుష్టశక్తి సైతాను మనం మెలకువగా లేని సమయం చూచి మనలో దురాలోచనలు చల్లుతాడు, దుష్ప్రేరణలు కలుగజేస్తాడు.

ఇలా నీతిమంతులకు, దుష్టులకు సంబంధించిన నిగూఢ సత్యాన్ని స్పష్టంగా నిర్వచించి బహిరంగంగా వెల్లడించిన మొట్ట మొదటి వ్యక్తి యేసు ప్రభువు. తరతరాలుగా నిగూఢంగా ఉన్న యథార్థాన్ని ప్రభువు ప్రపంచానికి ప్రకటించారు. గనుక విభిన్నమైన పరస్పర విరుద్ధమైన ఈ మనస్తత్వాలను స్పష్టంగా అర్థం చేసుకొని అప్రమత్తంగా మెలగాలంటే ప్రభుక్రీస్తు సహాయం కావాలి.

అలాగే గోధుమమొక్కలు కలుపుమొక్కలు కలగలసి చూపులకు ఒక్కలాగే కనిపించినట్లు "నీతిమంతులు" అవినీతిపరులు" ఒక్కలాగే కనిపిస్తాయి. అందరూ పవిత్రంగా ఉన్నట్లే అనిపిస్తారు, అందరూ మంచిపనులు చేస్తునట్లే భ్రమ కలిగిస్తారు. గనుక ఎవరు దుష్టులో వేలెత్తిచూపి వారిని దోషులుగా నిర్ధారించడం అంత సులభం కాదు. అంతేకాదు నీతిమంతులు దుష్టులు చూపులకు ఒక్కలా కనిపించడం మాత్రమే కాదు, ఒకదాని వేర్లు మరొక దాని వేర్లతో పెనవేసుకుపోయిన గోధుమలు కలుపుమొక్కలు మాదిరి నీతిమంతులు అవినీతిపరులు మౌలిక స్వభావాలు కలగలసి ఉన్నట్లు కనిపిస్తారు. గనుక వారి మధ్యగల వ్యత్యాసాన్ని కనిపెట్టడం మరింత కష్టమవుతుంది.

అన్నిటినీ మించి మనం తెలుసుకోవలసిన సత్యం మరొకటి ఉంది. అదేమిటంటే నిజానికి ఎవరూ పుట్టుకతోనే "నీతిమంతులు' కారు, లేదా పుట్టుకతోనే "అవినీతిపరులు" కారు. మనిషిని చూచి అతడు దుష్టుడో, మంచివాడో చెప్పడం కష్టం. ఎందుకంటే ప్రతి మనిషిలోనూ ఈ రెండు రకాల మనస్తత్వాలు "గోధుమలు కలుపుమొక్కల్లా" పెనవేసుకుని

ఉంటాయి. అయితే దుష్టజీవనం అనే కలుపు మొక్కలను వేరుచేసుకొని, తమను తాము దేవుని దృష్టిలో నీతిమంతులుగా మలచుకోవడం ఆయా వ్యక్తుల వ్యక్తిగత నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. ఇలా ప్రతి వ్యక్తీ సంపూర్ణమైన ఆత్మ పరివర్తనం చెందడానికి కొంత సమయం పడుతుంది. గనుక మనం త్వరపడి పరులకు తీర్పుచెబుతూ వారి మంచీ చెడులను నిర్ధారించే ప్రయత్నం చేయరాదు. దానికి బదులు మన హృదయ పరివర్తనకు మనం నిష్ఠగా కృషి చేస్తూ, మన సాటివారి మనోపరివర్తనకు దోహదం చేస్తూండాలి. అందుకు తగిన సమయాన్ని దేవుడు అందరికీ ప్రసాదిస్తూ ఉంటారు. ఎందుకంటే ఆయన సహనమూర్తి ఆయన సహనానికి అవధులుండవు.

ఇలా దేవుడు మనపట్ల చూపే సహనాన్ని సద్వినియోగం చేసుకుంటూ, ఆయన మనకు ప్రసాదించే అదనపు సమయాన్ని మన మనోపరివర్తనకు సాటి వారి హృదయ పరివర్తనకు వినియోగిస్తూ మారిన మనస్సులతో అందరమూ దేవుని రాజ్యంలో ప్రవేశించాలి.

ఇదే "గోధుమలు కలుపు మొక్కలు" ఉపమానం మనకు చేస్తోన్న ఉపదేశం!

**ముగింపు:**

మానవుల జీవితాలమీద సైతాను ప్రభావం అంత తేలికైనదేమీ కాదు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా పరమ నైష్ఠికులను కూడా భ్రష్టులను చేయడంలో సైతానును మించిన దుష్టశక్తి మరొకటి కనిపించదు. కానీ పునీత పౌలు చెబుతున్నట్లు పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం పవిత్ర జీవనం గడిపు వ్యక్తి మాత్రం సైతాను ప్రభావానికీ ప్రలోభాలకు లొంగడు. ఆత్మపూర్ణుడైన అతడు/ఆమె "పిండిలో పులుపు" మాదిరి తన చుట్టూ ఉన్న వారిని సన్మార్గానికి మళ్ళించగలుగుతారు, నీతిమార్గంలో నడిపించగలుగుతారు. క్రైస్తవులమైన మనం ఈ లోకంలో చేయవలసిన పని కూడా ఇదే. పిండిలో పులుపులా పనిచేయాలి.

మరి మనమెలా ఉన్నాం? మనం పవిత్రాత్మతో నిండి ఉన్నామా? పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం జీవిస్తున్నామా? పవిత్రాత్మ ప్రసాదించే దివ్యశక్తితో సైతాను శోధనలను జయిస్తూ, సత్యపథంలో జీవిస్తూ సత్ఫలితాలను సాధించగలుగుతున్నామా?

మన ఆత్మల సంస్కరణ....ఆత్మశోధనతోనే ఆరంభం కావాలి.

# సామాన్య 17వ ఆదివారం
# 30-07-2017

**1 రాజులు 3:5,7-12 రోమీ 8:28-30 మత్తయి 13:44-52**

సువార్త గ్రంథంలో యేసు చెప్పిన ఉపమానాలు మన ఆత్మ పరిశీలనకు దోహదం చేస్తాయి, మన జీవితంలో ఏవి ప్రధానమైనవో ఏవి అప్రధానమైనవో తెలుసుకోవడానికీ, తోడ్పడుతాయి. ఈ లోకంలో మనం ఎంతకాలం నివసించామన్నది ముఖ్యం కాదు, బతికిన రోజుల్లో ఎంతకాలం మనం దేవుడొసగిన దివ్యజ్ఞానంతో జీవించామన్నది ప్రధానం. ఇలా దేవుడనుగ్రహించే దివ్యజ్ఞాన ప్రేరణతో జీవించేవారు, సాక్షాత్తూ యేసు ప్రభువుతోనే సహజీవనం చేయగలుగుతారు; ప్రభుయేసుతో సహజీవనం చేయగలిగినవారు నిత్యజీవం పొందగలుగుతారు. అనంతకాలమూ జీవించగలుగుతారు.

## మొదటిపఠనం: 1రాజులు 3:5,7-12

సోలొమోను రాజు ఎనిమిది లక్షల జనాభాగల అవిభక్త ఇస్రాయేలీ రాజ్యన్ని 35 సంవత్సరాలపాటు పరిపాలించాడు. సోలోమోను రాజు మనోవైజ్ఞానికుడుగా, పాలనాధికారిగా, భవన నిర్మాతగా, వ్యాపారవేత్తగా ఎంతటి జ్ఞానసంపన్నుడో ఎంతటి కార్యదక్షుడో రాజులు మొదటి గ్రంథం సోదాహరణంగా వెల్లడిస్తుంది.

ఈనాటి దివ్యపూజలోని మొదటి పఠనం సొలోమోను రాజుకు అంతటి అపారమైన జ్ఞానం ఎలా లభించిందో తెలియజెబుతుంది. గ్రీకు సంప్రదాయం ప్రకారం తార్కికమైన ఆలోచనల నుంచి జ్ఞానం పుడుతుంది అయితే ఇది సృష్టించబడిన భౌతిక ప్రపంచానికి చరాచర జీవజలానికీ సంబంధించిన విజ్ఞానానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. ఒక్కడ జ్ఞానానికీ, సృష్టికర్తకు సంబంధం లేదు.

బైబులు గ్రంథం ప్రకారం సృజింపబడిన లోకానికీ, సృష్టికర్త దేవునికీ సంబంధించిన విజ్ఞాన సర్వస్వమూ "జ్ఞానం" గా పరిగణింపబడుతుంది. "జ్ఞానము" అంటే లౌకిక జ్ఞానమూ, దైవజ్ఞానమూ రెండింట సమ్మేళనమవుతుంది. బైబులు ప్రబోధం ప్రకారం సృష్టికర్తను తెలుసుకోగలిగినవారు సృష్టిలోని సమస్తాన్నీ తెలుసుకోగలుగుతారు.

దేవుడు ఏ ఉద్దేశ్యంతో భౌతిక ప్రపంచాన్ని సృష్టించారో, ఆ ఉద్దేశ్యానికి అనుగుణంగానే వారు భౌతిక వస్తుజాలాన్ని వినియోగించుకొనే ప్రయత్నం చేస్తారు. ఈ విధంగా బైబులు జ్ఞానం వల్ల మనకు మంచీ చెడుల విచక్షణా శక్తి కూడా లభిస్తుంది.

ఈనాటి పఠనంలో దేవుడు సొలోమోనుతో అతడికి ఇష్టమైన వరాన్ని నిస్సంకోచంగా కోరుకొమ్మంటారు. అప్పుడు సొలోమోను తన ఇస్రాయేలు రాజ్యశ్రేయాన్నీ వికాసాన్నీ దృష్టిలో ఉంచుకొని, అందుకు దోహదంద చేసే "జ్ఞానవరాన్ని" కోరుకుంటాడు.

సొలోమోను దైవ విధేయుడు, దీనాత్ముడు. ప్రజలకు తాను రాజైనప్పటికీ, దేవునికి తాను సేవక ప్రాయుడనేనని భావించేవాడు. తన ఏలుబడిలో ఉన్న ప్రజలు తనకు దాసులు కారనీ, వారు సాక్షాత్తూ దేవుడు ఎన్నుకొన్న పవిత్ర జనమని సొలోమోను ఎన్నడూ మరువలేదు. గనుకనే స్వార్థప్రయోజనాలనుకాక దైవజనులందరి సంక్షేమాన్ని వాంఛిస్తూ "జ్ఞానవరము" అర్థించాడు, దేవుని మన్ననలు పొందగలిగాడు.

నిజానికి మనలోని ప్రతి ఒక్కరమూ కోరుకోదగిన శ్రేష్టమైన వరం, సర్వోన్నతమైన జీవన విలువ మనందరకీ ఆదర్శ ప్రాయమైన ప్రార్థన. సొలోమోను రాజు దేవునికి ఇష్టమైన వరాన్నీ, దేవుడు తనకు ఈయదలచిన వరాన్నే కోరుకుంటూ ప్రార్థన చేశాడు. అలాగే మనమూ దేవుని మనసెరిగి ప్రార్థన చేయాలి, దేవుని అభీష్టానికే పెద్దపీట వేయాలి. దేవుడు మనకెప్పుడూ "మేలైన కానుక" లనే ప్రసాదిస్తారన్న నమ్మకంతో ప్రార్థన చేయాలి.

ఈనాటి సువార్త పఠనం కూడా మనం దైవరాజ్యానికే అత్యధిక ప్రాధాన్యమీయాలని బోధిస్తుంది.

## రెండవ పఠనం: రోమీ 8:28-30

పునీత పౌలు ఉద్దేశ్యం ప్రకారం ఇప్పుడు మనం యేసుక్రీస్తు ప్రభువును విశ్వసిస్తున్నామంటే ఇప్పటికే దేవుడు మన "రక్షణ ప్రక్రియ"ను ఆరంభించారని అర్థం. అంటే మన ఆత్మ రక్షణ కోసం కృషి చేస్తున్నది నిజానికి మనం కాదు మనలో కొలువుదీరిన భగవానుడే మనలను రక్షణమార్గంలో నడిపిస్తున్నారు. దేవుడు మనకు నిర్దేశించిన రక్షణప్రణాళిక ప్రకారమే మనం యేసుక్రీస్తు పట్ల ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించగలుగుతున్నాం.

ఈనాటి పఠనంలో పౌలు మన రక్షణ కోరుతూ దేవుడు చేసిన పనులన్నింటినీ "భూతకాలార్థం"లో పేర్కొన్నాడు.. ఉదాహరణకు – "పిలువబడినవారు" "ఏర్పరచెను", "నీతిమంతులనుగ చేసెను "తన మహిమలో పాలు పంచి ఇచ్చెను" మొదలైన పదాలన్నీ ఇదే సత్యాన్ని ధ్రువపరుస్తున్నాయి. అంటే సృష్ట్యాది నుంచే దేవుడు మన రక్షణకు తగిన ఏర్పాట్లు చేస్తూ వస్తున్నారనీ, ఇందులో భాగంగానే తాను ఎన్నుకున్న ప్రజలను తనను ప్రేమించే భక్తజనులను పునరుత్థానుడైన తన కుమారుని ప్రతిరూపాలుగా తీర్చిదిద్దుతారనీ తెలుసుకోవాలి. అలా దేవుడు "అనంతకాలం" లో శ్రీకారంచుట్టిన మన రక్షణకార్యాన్ని ఈనాడు సంపూర్ణంగా నెరవేర్చబోతున్నారు. ఇంతకుముందు చెప్పుకున్నట్టు ఇప్పటికే మనం క్రీస్తు ప్రభువును విశ్వసిస్తూ, తండ్రి దేవుని పట్ల ప్రగాఢమైన ప్రేమను కలిగిఉన్నాం. గనుక, ఆ తండ్రి భగవానుడే మనకు సంపూర్ణ రక్షణభాగ్యాన్ని ప్రసాదించబోతున్నారని రూఢిగా చెప్పుకోవచ్చు. అంతేకాదు ప్రస్తుతం మనం క్రీస్తు పునరుత్థాన భాగ్యంలో పాలుపంచుకుంటూ ఆయన సాహచర్యంలో క్రమక్రమంగా పరిణితి చెందుతూ వస్తున్నాం. ఇది కూడా తండ్రి దేవుని పట్ల మనకు గల ఆశాభావానికి బలమైన ప్రాతిపదిక అవుతుంది.

## సువార్త పఠనం: మత్తయి 13:44-52

ఈనాటి సువార్త పఠనంలో మనం చదువుతోన్న "దాచబడిన ధనము" "ఆణిముత్యము", "మంచి చేపలు, చెడు చేపలు" అనే ఈ మూడు ఉపమానాలు మనకు మత్తయి సువార్తలో మాత్రమే కనిపిస్తాయి.

ఇందులోని మొదటి ఉపమానంలో ఒక కౌలుదారుకు తాను సాగుచేస్తోన్న పొలంలో గుప్తధనం కనబడుతుంది. ధనికులు తమ ధనరాసులను పొలాల్లో దాచడం ఒకటో శతాబ్దపు పాలస్తీనాలో సర్వసాధారణం. శత్రురాజులు దండెత్తి రావడం, అందినది అందినట్లు దోచుకుపోవడం, అలాగే అంతర్గత విప్లవాలు తలెత్తడం, ప్రజలు ఇళ్ళూ వాకిళ్ళూ వదిలి పలాయనం కావడం ఆ కాలంలో తరచూ జరిగే సంఘటనలు ఆ నేపథ్యంలో తమకున్న మిగులు ధనాన్ని కొందరు తమ పొలాల్లో దాచిపెడుతూ ఉండేవారు. ఒకవేళ వారు బతికిబట్టకట్టగలిగితే మళ్ళీ వచ్చి తాము దాచుకున్న ధనాన్ని తిరిగి స్వంతం చేసుకొనేవారు. ఒకవేళ అజ్ఞాతంలోనే వారు కాలధర్మం చెందితే వారు పొలంలో దాచుకున్న గుప్తధనం అలాగే ఉండిపోయేది. మన ఉపమానంలోని కౌలుదారుకు

అనుకోకుండా అలాంటి గుప్తధనమే కంటపడింది. నిజానికతడు గుప్తధనం కోసం వెదకడం లేదు; ఏదో పని చేస్తూండగా ఈ ధనమతడి కంటపడింది, అంతే!

అయితే రెండవ ఉపమానంలోని వర్తకుడు మాత్రం ఎంతో కాలంగా అపురూపమైన ఆణిముత్యం కోసం దేశదేశాలూ తిరుగుతున్నాడు. అది ఎక్కడ ఉన్నా కొని స్వంతం చేసుకోవాలని ఆరాటపడుతున్నాడు. ఎట్టకేలకు ఎంతోకాలంగా అతడు వెదుకుతోన్న ఆణిముత్యాన్ని కనుగొనగలిగాడు.

మొదటి ఉపమానంలో కౌలుదారుకు వెదకకుండానే “గుప్తధనం” కంటపడితే, రెండో ఉపమానంలో వర్తకుడి ఎంతోకాలం వెదికిన తరువాతనే ఆణిముత్యం ఆచూకీ దొరికింది. అయితే అందుకు ఇద్దరూ ఒకేరకంగా స్పందించారు. ముందు ఎంతగానో సంతోషించారు. తరువాత ఎంత ఖర్చయినా సరే తాము కనుగొన్న సంపదను స్వంతం చేసుకోవడానికి సిద్ధపడ్డారు. ఆ ప్రకారమే ఇద్దరూ వెళ్ళి తమకున్న ఆస్తిపాస్తులన్నిటినీ అమ్మివేశారు అంటే అప్పటివరకు తాము గడుపుతోన్న పాత జీవన విధానంలో సంపూర్ణమైన మౌలికమైన మార్పులు తెచ్చుకోవడానికి సిద్ధమయ్యారు. చివరికి తాము కనుగొన్న సంపదను స్వంతం చేసుకోగలిగారు. అంటే ఆ క్షణం నుంచీ తాము స్వంతం చేసుకున్న సంపదతో కొత్తజీవితాన్ని ఆరంభించగలిగారు.

అదే విధంగా యేసుక్రీస్తు ప్రభువుతో సహజీవనం చేయదలచుకున్నవారు. అప్పటివరకు తాము అమూల్యమైనవిగా భావించే వాటినన్నింటినీ విధిగా వదులుకోవాలి, సంపూర్ణంగా పరిత్యజించాలి. ఈ ప్రపంచం మనకిచ్చే సమస్త సిరులకంటే యేసుక్రీస్తు సాహచర్యమే కోటిరెట్లు మిన్న అని తెలుసుకోవాలి.

ఒకవేళ ఎవరైనా ప్రభు సాహచర్యంలోగల విలువను తెలుసుకొని కూడా ప్రభువుతో సహజీవనం చేయడానికి నిరాకరించినట్లయితే, నిర్లక్ష్యం ప్రదర్శించినట్లయితే అలాంటివారు “దుష్టులు” గా గణింపబడతారు, దైవరాజ్యం నుంచి శాశ్వతంగా వేరుచేయబడతారు. అంటే వారు క్రీస్తు ప్రభువుతో అనంతకాలం జీవించే భాగ్యాన్ని శాశ్వతంగా కోల్పోతారు.

అలా ఈ మూడు ఉపమానాలను చెప్పాక యేసు ప్రభువు క్రైస్తవ సంఘాలలో సభ్యులైన ధర్మశాస్త్రబోధకులను అభినందిస్తూ వారిని ఇలా అభివర్ణించారు “పరలోక రాజ్యమునకు శిక్షణ పొందిన ప్రతి ధర్మశాస్త్ర బోధకుడు తన కోశాగారము నుండి నూతన పురాతన వస్తువులను వెలికి తెచ్చు ఇంటి యజమానుని పోలియున్నాడు”. అంటే క్రైస్తవ సంఘాలలో సభ్యులైన ధర్మశాస్త్ర బోధకులకు క్రీస్తు ప్రభువుతో సహజీవనం

చేయడం గురించి పవిత్రాత్మ ప్రబోధిస్తున్నారు. ఆ విధంగా వారు నూతన వేద పరిజ్ఞానంలో నిష్ణాతులవుతున్నారు. ఇకపోతే ధర్మశాస్త్ర బోధకులుగా అప్పటికే వారు పూర్వ వేదంలో పాండిత్యం గలవారు. గనుక వారిప్పుడు తమ ప్రబోధాల ద్వారా పూర్వ నూతన నిబంధనలు రెండింటి సారాంశాన్ని ప్రజలకు అందజేయగలుగుతారు; పూర్వ నిబంధనం ఏవిధంగా నూతన నిబంధనం ద్వారా సంపూర్ణమయిందో వివరించగలుగుతారు.

**ముగింపు :**

మనం తీసుకునే నిర్ణయాలమీదనే మన జీవితం ఆధారపడి ఉంటుంది. జీవితంలో మనకున్న నమ్మకాలు విలువలు మనం తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేస్తూంటాయి. మన నమ్మకాలు మన జీవన విలువలు దేవునిపై ఆధారపడి ఉంటే, మనం తీసుకునే నిర్ణయాలు దేవుని చిత్తానికి అనుకూలమైనవవుతాయి. అలాకాక మనకున్న నమ్మకాలు విలువలన్నీ లోకానికి సంబంధించినవైతే, మనం తీసుకునే నిర్ణయాలు కూడా లోకానికి అనుకూలంగా ఉంటాయి.

క్రైస్తవులమైతే మనం ఎల్లవేళలా దేవుని పక్షాననే నిలవాలి, దేవునికి అనుకూలమైన నిర్ణయాలే తీసుకోవాలి, దేవుని కోసమే జీవించాలి. అంటే లౌకిక ప్రవాహంలో పడికొట్టుకుపోకుండా జాగ్రత్తపడాలి.

అలాగే జీవితంలో ఒక నిర్ణయం తీసుకొని ఒక మార్గాన్ని ఎంచుకున్నాక, అందుకు భిన్నమైన వాటినన్నింటినీ వదలుకోగలగాలి. ఉపమానంలోని వర్తకుడు తాను కనుగొన్న ఆణిముత్యాన్ని స్వంతం చేసుకోవడం కోసం తనకున్న సర్వస్వాన్నీ వదులుకున్నాడు. మరి దేవుని కోసం మనం వదలుకున్నదేమిటో? మనం కోల్పోయినదేమిటి? ఆలోచిద్దాం!

# సమాచారములు

## క్రైస్తవ మౌళిక సంఘాల అవగాహన సదస్సులు

### (వికారియేట్ స్థాయిలో ఉపదేశులకు సదస్సులు)

### 1. గుడివాడ వికారియేట్ - 1వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: గుడివాడ టౌన్ విచారణ | గుడివాడ, గుడ్‌మన్‌పేట, గుడ్లవల్లేరు, పోలుకొండ, వెన్ననపూడి, వెంట్రప్రగడ |
| తేదీ: 10 జూలై, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

### గుడివాడ వికారియేట్ - 2వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: పామర్రు విచారణ | పామర్రు, ఉయ్యూరు |
| తేదీ: 11 జూలై, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

### 2. కోరుకొల్లు వికారియేట్ - 1వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: కలిదిండి విచారణ | కలిదిండి, ముదినేపల్లి, కైకలూరు, భైరవపట్నం |
| తేదీ: 17 జూలై, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

### కోరుకొల్లు వికారియేట్ - 2వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: కోరుకొల్లు విచారణ | బంటుమిల్లి, కొత్తపల్లి, లక్ష్మీపురం, కోరుకొల్లు |
| తేదీ: 18 జూలై, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

### 3. మచిలీపట్నం వికారియేట్ - 1వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: కొన్నేపూడి విచారణ | మంగినపూడి, మచిలీపట్నం, పెడన, శారదానగర్ కొన్నేపూడి |
| తేదీ: 24 జూలై, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

## మచిలీపట్నం వికారియేట్ – 2వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: చల్లపల్లి విచారణ | చల్లపల్లి,అవినిగడ్డ నాగాయలంక,ఏసుపురం కోడూరు, కూచిపూడి |
| తేదీ: 25 జూలై, 2017 | |
| సమయం: ఉ।। 10 నుండి సా।। 4 వరకు | |

## 4. నందిగామ వికారియేట్ – 1వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: కంచికచర్ల విచారణ | కీసర, కంచికచర్ల, బోడవాడ–జమ్మవరం, జగన్నాధపురం |
| తేదీ: 07 ఆగష్టు, 2017 | |
| సమయం: ఉ।। 10 నుండి సా।। 4 వరకు | |

## నందిగామ వికారియేట్ – 2వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: నందిగామ విచారణ | నందిగామ, సిలువగిరి నవాబుపేట, మునగాలపల్లి, తుర్లపాడు |
| తేదీ: 08 ఆగష్టు, 2017 | |
| సమయం: ఉ।। 10 నుండి సా।। 4 వరకు | |

## నందిగామ వికారియేట్ – 3వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: చిల్లకల్లు విచారణ | చిల్లకల్లు, జగ్గయ్యపేట ముచ్చింతాల,వత్సవాయి |
| తేదీ: 09 ఆగష్టు, 2017 | |
| సమయం: ఉ।। 10 నుండి సా।। 4 వరకు | |

## 5. నూజివీడు వికారియేట్ – 1వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: నూజివీడు టౌన్ విచారణ | నూజివీడు, నెర్రహూపేట ముసునూరు,రమణక్కపేట తుక్కులూరు, ఈదులుగూడెం |
| తేదీ: 21 ఆగష్టు, 2017 | |
| సమయం: ఉ।। 10 నుండి సా।। 4 వరకు | |

## నూజివీడు వికారియేట్ 2వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: ఈదర విచారణ | మైలవరం, ఈదర ఆగిరిపల్లి |
| తేదీ: 22 ఆగష్టు, 2017 | |
| సమయం: ఉ।। 10 నుండి సా।। 4 వరకు | |

**6. తిరువూరు వికారియేట్ - 1వ గ్రూపు**

| | |
|---|---|
| స్థలం: చాట్రాయి విచారణ | విస్సన్నపేట, లూర్ధునగర్ చనుబండ, చాట్రాయి వెలగలగూడెం, కోటపాడు |
| తేదీ: 28 ఆగష్టు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

**తిరువూరు వికారియేట్ - 2వ గ్రూపు**

| | |
|---|---|
| స్థలం: కంబంపాడు విచారణ | కంబంపాడు, తిరువూరు గంపలగూడెం పేనుగొలను |
| తేదీ: 29 ఆగష్టు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

**7. సెంట్‌పాల్స్ వికారియేట్ - 1వ గ్రూపు**

| | |
|---|---|
| స్థలం: పాస్టరల్ సెంటర్ | సెంట్‌పాల్స్ వికారియేట్ గుణదల, లబ్బీపేట క్రీస్తురాజుపురం, రాణిగారితోట |
| తేదీ: 11 సెప్టెంబరు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

**సెంట్‌పాల్స్ వికారియేట్ - 2వ గ్రూపు**

| | |
|---|---|
| స్థలం: కంకిపాడు విచారణ | కంకిపాడు, వణుకూరు కానూరు, పెనమలూరు |
| తేదీ: 12 సెప్టెంబరు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

**8. సెంట్‌పీటర్స్ - కో కతెడ్రల్ వికారియేట్ - 1వ గ్రూపు**

| | |
|---|---|
| స్థలం: పెజ్జోనిపేట విచారణ | పెజ్జోనిపేట, జక్కంపూడి సెంట్‌పీటర్స్ - కో కతెడ్రల్ సత్యన్నారయణపురం ఆర్.ఆర్. పేట, వెల్లటూరు |
| తేదీ: 18 సెప్టెంబరు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

**సెంట్‌పీటర్స్ - కో కతెడ్రల్ వికారియేట్ 2వ - గ్రూపు**

| | |
|---|---|
| స్థలం: పాస్టరల్ సెంటర్ | గొల్లపూడి, జోజినగర్ గుంటుపల్లి, కొండపల్లి ఇబ్రహీంపట్నం పైడూరుపాడు |
| తేదీ: 19 సెప్టెంబరు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

### 9. అవుటపల్లి వికారియేట్ - 1వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: అజ్జంపూడి విచారణ | అజ్జంపూడి, ఉప్పలూరు<br>గన్నవరం, ఎనికేపాడు<br>కేసరపల్లి, కొండపావులూరు<br>వేల్పూరు, పెదముస్తాబాదా |
| తేదీ: 25 సెప్టెంబరు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

### అవుటపల్లి వికారియేట్ - 2వ గ్రూపు

| | |
|---|---|
| స్థలం: తేలప్రోలు విచారణ | తేలప్రోలు<br>హనుమాన్ జంక్షన్<br>ఆరుగొలను, అవుటపల్లి |
| తేదీ: 26 సెప్టెంబరు, 2017 | |
| సమయం: ఉ॥ 10 నుండి సా॥ 4 వరకు | |

## ఫా. రెడయెల్లి ఎడ్యుకేషనల్ సొసైటి: స్కాలర్‌షిప్పుల పంపిణి

2017 మార్చినెలలో జరిగిన 10వ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులైన కతోలిక బాలబాలికలకు, మార్కులను బట్టి ప్రతి విచారణలోను 5గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1000/- స్కాలర్‌షిప్ బహుకరించుటకు సదరు సొసైటి నిర్ణయించటమైనది.

విచారణ కర్తలు, విద్యార్థి పదవ తరగతి మార్కుల లిస్టు జిరాక్స్, జ్ఞానస్నానపు సర్టిఫికేట్, ఫాదరుగారి కవరింగు లెటర్ జతచేసి విద్యార్థి తండ్రి పూర్తి పోస్టల్ అడ్రస్సుతో రూ. 5/- సంచి కవరును తప్పకపెట్టి ది. 15-07-2017వ తేది లోపల **రెవ.ఫా. మల్లవల్లి బాలస్వామిగారు**, చైర్మెన్, ఆర్.సి,యమ్ చర్చి, గన్నవరం-521101 కు పంపవలెను.

# ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు

| | | | |
|---|---|---|---|
| కె. స్టాన్లీ | తుర్లపాడు | 01-07-1964 | |
| డి. యేసుపాదం | నెప్రూపేట | 01-07-1951 | 9392235513 |
| డి. జ్ఞానప్రసాదం | అవనిగడ్డ | 01-07-1947 | |
| యన్. పేతురు | కొన్నేపూడి | 01-07-1973 | |
| జి. విజయరాజు | హెచ్. జంక్షన్ | 03-07-1962 | |
| జి. జోసఫ్ | నూజివీడు | 05-07-1960 | |
| యన్. కాంతరాజు | కలిదిండి | 06-07-1973 | |
| ఎ. ఇన్నయ్య | వెలగలగూడెం | 07-07-1954 | |
| ఎ. లాజరు | చాట్రాయి | 10-07-1976 | |
| కె. బెంజిమెన్ | కోరుకల్లు | 12-07-1949 | |
| ఆర్. మరియన్న | ఈదర | 14-07-1969 | |
| కె. యేసు | రమణక్కపేట | 15-07-1959 | 9553481661 |
| యస్. జాన్ | పామర్రు | 17-07-1977 | |
| పి. రమేష్ | చిల్లకల్లు | 17-07-1980 | |
| బి. యేసుపాదం | కంబంపాడు | 18-07-1971 | |
| బి. కిరణ్ | కంచికచర్ల | 20-07-1997 | |
| కె. జేసురావు | భాస్కరరావుపేట | 20-07-1973 | 9603587349 |
| యస్. కుటుంబరావు | మల్లవల్లి | 23-07-1991 | |
| జి. బాలరాజు | లక్ష్మీపురం | 23-07-1971 | |
| డి. అమృతరావు | మంగినపూడి బీచ్ | 24-07-1958 | |
| జి. కిషోర్ | హెచ్. జంక్షన్ | 25-07-1987 | |
| పి. ఆదాము | చనుబండ | 27-07-1985 | |
| ఎ. బాలశౌరి | లూర్దునగర్ | 29-07-1959 | |